Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 217 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 ఆగస్టు 2023 ఆదివారం పేజీలు : 4

## చైనా ఆక్రమణపై మోదీ అబద్ధాలు

కార్గిల్ : చైనా మన భూభాగంలో కొంత లాగేసుకున్నదనేది లద్దాఖ్‌లో ఎవరిని అడిగినా చెబుతారని ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ అన్నారు. కానీ, ఒక ఇంచు భూమి కూడా ఆక్రమణకు గురి కాలేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పే మాటలన్నీ పూర్తిగా బూటకమని విమర్శించారు. దక్షిణాఫ్రికాలోని జొహాన్నెసబర్గ్‌లో బ్రిక్స్ సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, ప్రధాని మోదీ కొద్ది సేపు మాట్లాడుకున్నారని, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, పరస్పరం సైనిక బలగాల ఉపసంహరణ తదితర అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్టు వార్తలు వెలువడ్డాయి. తూర్పు లద్దాఖ్ పరిధిలోని వాస్తవాధీన రేఖ వద్ద నెలకున్న ఉద్రిక్తతలను సడలించడం అవసరమని జిన్‌పింగ్‌కు మోదీ స్పష్టం చేసినట్టు కూడా కథనాలు వెలుపడ్డాయి. ఈ నేపథ్యంలో రాహుల్ స్పందించారు. "వారం రోజులపాటు మోటార్ బైకుపై లద్దాఖ్ అంతా చుట్టివచ్చాను. లద్దాఖ్ మనకు అతి కీలక వ్యూహాత్మక ప్రాంతం. అక్కడి పాంగాంగ్ సరస్సు ఒడ్డున బస చేసినప్పుడు ఒక విషయంలో నాకు స్పష్టత వచ్చింది. కొన్నివేల కిలోమీటర్ల భారత భూభాగం చైనా ఆక్రమణలో ఉన్నదనేది నాకు తెలిసి వచ్చింది. కానీ, దీనిపై తప్పుడు సమాచారాన్ని ప్రతిపక్షాల భేటీలో ప్రధాని ఇవ్వడం దురదృష్టకరం. మోదీ అబద్ధాలు ఆడుకున్నారు" అని రాహుల్ విమర్శించారు.

# కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారు




## అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించిన 12 హామీలు అమలు : ఖర్గే



చేవెళ్ల: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించిన 12 హామీలు అమలు చేస్తామని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల కేవీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజాగర్జన సభకు ఖర్గే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. తెలంగాణ కోసం అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేస్తే.. తనవల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ చెబుతున్నారని విమర్శించారు. సోనియాతో ఫొటో తీసుకుని బయటకు వచ్చి మాట మార్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలను మోదీ ఎన్నిసార్లు తిడతారని ప్రశ్నించారు. దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెసేతర ప్రభుత్వాలు దేశానికి ఏం చేశాయని నిలదీశారు. నెహ్రూ, పటేల్ కలిసి చిన్న చిన్న రాజ్యాలను ఏకం చేశారని గుర్తు చేశారు. 53 ఏళ్ల కాంగ్రెస్ పరిపాలనలో దేశాన్ని బలోపేతం చేశామని గుర్తు చేశారు.

**12 అంశాలతో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ :** "ఆహార భద్రత చట్టాన్ని మేమే తెచ్చాం. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులను ఎవరు నిర్మించారు? మేం చేసిన పనుల వల్లే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగింది. భూ సంస్కరణలు అమలు చేసి జమీందారీ వ్యవస్థను నిషేధించాం. బ్యాంకులను జాతీయం చేసింది కాంగ్రెస్ పార్టీ. నరేగా చట్టం తెచ్చింది ఎవరు?. హైదరాబాద్‌కు అనేక సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చింది. దేశంలోని ప్రముఖ కంపెనీలను కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉందంటే రాజీవ్‌గాంధీనే కారణం. హరిత విప్లవం, శ్వేత విప్లవం కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయి. మేం చేపట్టిన కార్యక్రమాల వల్లే మహిళా అక్షరాస్యత 65శాతమైంది. విద్యా, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలు చేపట్టాం. దేశాన్ని ఐక్యంగా ఉంచడమే కాంగ్రెస్ సిద్ధాంతం. ప్రజల మేలు కోసమే కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంది.

దేశ ఐక్యతకు కృషి చస్తూ ఇందిర, రాజీవ్ ప్రాణాలు వదిలారు" అని మల్లికార్జున ఖర్గే వివరించారు. ప్రజాస్వామ్య దేశం వల్లే తాను కాంగ్రెస్ అధ్యక్షుడిని అయ్యానన్నారు. కేసీఆర్.. బయట భాజపాను తిడతారు, లోపల మంతనాలు జరుపుతారని విమర్శించారు. సభావేదికపై ఏర్పాటు చేసిన గద్దర్ చిత్రపటానికి ఖర్గే పూలమాల వేసి నివాళులర్పించారు. ఖర్గే సమక్షంలో పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యకర్తలు భారీగా రావడంతో చేవెళ్ల-శంకర్‌పల్లి మార్గంలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

## కాళేశ్వరం నీళ్లు రాకపోతే యాసంగి పంటలు పండేనా? : మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట: కాంగ్రెస్ హయాంలో కాలం కోసం ఎన్నో తిప్పలు పడ్డామని, కానీ ఇప్పుడు కాలం కాకున్నా మనకు కాళేశ్వరం నీళ్లు ఉన్నాయని మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం నీళ్లు రాకపోతే యాసంగి పంటలు పండేనా అని ప్రశ్నించారు. నీళ్లు లేకపోతే జీవం లేదు, నీళ్లు లేకపోతే బతుకుదెరువు లేదన్నారు. అలాంటి జీవాన్ని సీఎం కేసీఆర్ ఇచ్చారని చెప్పారు. సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి హరీశ్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 233 మంది దివ్యాం గులకు ఉపకరణాలను అందించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివ్యాంగులకు దేశంలోనే అత్యధికంగా రూ.4016 పింఛను అందిస్తున్నామన్నారు. దివ్యాంగుల పట్ల మానవతా దృష్టి, ప్రేమతో దగ్గరికి తీసుకుంటున్న నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.1000 మించి పింఛన్ ఇవ్వడం లేదని విమర్శించారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ పార్టీ హయాంలో దొంగరాత్రి కరెంటు, పేలిన ట్రాన్స్‌ఫార్మర్లు, కాలిన మోటర్లు అని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు తిట్ల పోటీలో పోటీ పడుతున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ వడ్లు పుట్లు పుట్లుగా పండించేందుకు పోటీ పడుతున్నారని తెలిపారు. మన వడ్లు కొనడానికి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు అడుగుతున్నాయని చెప్పారు. తెలంగాణను దేశ ధాన్యాగారంగా సీఎం కేసీఆర్ మార్చారని తెలిపారు.

## ఈ ఎంపీలంతా ఈసారి అసెంబ్లీకే!

హైదరాబాద్ : తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ గట్టి కంకణం కట్టుకుంది. పక్క రాష్ట్రం కర్ణాటకలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో తెలంగాణ కాంగ్రెస్ నేతల్లోనూ ఉత్సాహం ఉరకలేస్తోంది. ఓవైపు పార్టీలోకి బలమైన నేతలు చేరుతున్నారు. అగ్ర నేతలంతా తమ మధ్య విభేదాలను విడనాడి ఐకమత్యంతో ముందుకు కదులుతున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి కాంగ్రెస్ కు అధికారం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అధికారంలోకి రావడం ఖాయమనే అభిప్రాయాలు ఉండటంతో ప్రస్తుతం ఎంపీలుగా ఉన్న నేతలంతా ఈసారి అసెంబ్లీకి పోటీ చేయడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున తెలంగాణలో ముగ్గురు ఎంపీలు ఉన్నారు.. వారు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి (మల్కాజిగిరి), కోమటిరెడ్డి వెంకటరెడ్డి (భువనగిరి), ఉత్తమ్ కుమార్ రెడ్డి (నల్గొండ). ఈ ముగ్గురిలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండ నుంచి ఓటమిపాలయ్యారు. ఒక్క ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒక్కరే హుజూర్ నగర్ నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. దీంతో 2019లో జరిగిన ఎన్నికల్లో రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పార్లమెంటుకు పోటీ చేసి గెలుపొందారు. అయితే ఈసారి ఈ ముగ్గురు నేతలు అసెంబ్లీకి పోటీ చేయనున్నారు. ఇప్పటికే రేవంత్ రెడ్డి తాను కొడంగల్ నుంచే పోటీ చేస్తానని తెలిపారు. మరోవైపు ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా తాను, తన సతీమణి పద్మావతి... హుజూర్ నగర్, కోదాడ స్థానాల నుంచి బరిలో ఉంటామని స్పష్టం చేశారు. ఇక కోమటిరెడ్డి వెంకటరెడ్డి సైతం తాను పలుమార్లు గెలుపొందిన నల్గొండ అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో వీరు విజయం సాధించడంపై ఎవరికీ అనుమానాలు లేకపోయినా.. ఇప్పుడు ఎంపీ స్థానాలకు వీరు ఖాళీ చేసే స్థానాల్లో గట్టి అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. తెలంగాణలో మాత్రమే కాకుండా కేంద్రంలోనూ ఈసారి అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో బలమైన నేతలుగా, ప్రస్తుతం ఎంపీలుగా ఉన్న రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



అసెంబ్లీకి పోటీ చేస్తారు కాబట్టి ఎంపీ స్థానాల్లోనూ వీరి స్థాయి అభ్యర్థులను కాంగ్రెస్ నిలబెట్టాల్సి ఉంటుంది. ఇలా గట్టి నేతలు అసెంబ్లీకి పోటీ చేయడం వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో లాభించినా మరోవైపు పార్లమెంటు ఎన్నికలకు గట్టి అభ్యర్థులు లభించకపోతే కొంత ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయని అంటున్నారు.

# ఇస్రో శాస్త్రవేత్తలకు సెల్యూట్




## శాస్త్రవేత్తలకు అభినందలు తెలిపిన ప్రధాని మోదీ

బెంగళూరు: చంద్రయాన్ - 3 ద్వారా అసాధారణ విజయం నమోదు చేశామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ మేరకు ఇస్రో శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేస్తున్నట్లు భావోద్వేగానికి గురయ్యారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించేందుకు.. విదేశీ పర్యటన ముగించుకొని ప్రధాని నేరుగా బెంగళూరుకు వచ్చారు. విమానాశ్రయం వద్దకు వచ్చిన అభిమానులకు మోదీ అభివాదం చేశారు. అక్కడి నుంచి నేరుగా పీణ్యలోని ఇస్రో కేంద్రానికి వెళ్లి.. శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ సందర్భంగా చంద్రయాన్-3 ప్రయోగం తీరును ప్రధానికి ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ వివరించారు. అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. 'జై విజ్ఞాన్.. జై అనుసంధాన్' నినాదం ఇచ్చారు.

**ఇది అసాధారణ విజయం :** "ఇస్రో సాధించిన విజయం చాలా గర్వకారణం. చంద్రయాన్ - 3 సాఫ్ట్ ల్యాండింగ్ సమయంలో దక్షిణాఫ్రికాలో ఉన్నా. నా మనసంతా చంద్రయాన్ - 3 విజయంపైనే ఉంది. విజయం పట్ల శాస్త్రవేత్తలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఇది అసాధారణ విజయం. చంద్రుడిపై భారత్ అడుగుపెట్టింది. అంతరిక్ష చరిత్రలో సరికొత్త చరిత్ర సృష్టించాం. ఇప్పుడు భారత్ చంద్రుడిపై ఉంది. మన సత్తా ఏమిటో ప్రపంచానికి చాటాం. ప్రపంచంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపగలమని నిరూపించాం. గతంలో ఎవరూ చేయలేనిది ఇప్పుడు ఇస్రో చేసింది చంద్రయాన్ - 3 దిగిన ప్రదేశానికి శివశక్తి పేరు పెట్టుకుందాం. 2019లో చంద్రయాన్-2 క్రాష్ ల్యాండ్ అయిన ప్రదేశానికి గుర్తింపునిస్తూ దానిని 'తిరంగా పాయింట్' అని పిలుచుకుందాం.

**ఇంటిపైనే కాదు.. చంద్రుడిపైనా మన త్రివర్ణ పతాకం :** చంద్రయాన్-2 వైఫల్యంతో మనం వెనకడుగు వేయలేదు. మరింత పట్టుదలతో పనిచేసి చంద్రయాన్ -3 విజయం సాధించాం.

ఇప్పుడు ప్రతి ఇంటిపైనే కాదు.. చంద్రుడిపైనా త్రివర్ణ పతాకం ఎగురుతోంది.. శాస్త్ర, సాంకేతికరంగాల్లో భారత్ దూసుకెళ్తోంది. ప్రపంచానికే భారత్ దిక్సూచిగా మారుతోంది. చంద్రయాన్ - 3 కృషిలో మహిళా శాస్త్రవేత్తలు ఉండటం గర్వకారణం. మన నారీ శక్తి ఏమిటో ప్రపంచానికి మరోసారి చాటాం. ఇస్రో సాధించిన విజయం ఎన్నో దేశాలకు స్ఫూర్తినిస్తుంది.

**ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం :** 'మేకిన్ ఇండియా' ఇప్పుడు చంద్రుడి వరకు సాగింది. మంగళ్‌యాన్, చంద్రయాన్ విజయం స్ఫూర్తిని కొనసాగిద్దాం. ఈ విజయాల స్ఫూర్తితో గగన్‌యాన్‌కు సిద్ధమవుదాం. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్వహించుకుందాం. అంతరిక్ష విజ్ఞానంతో ఎన్నో ఫలితాలు అందుకోవాలి. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఈ విజ్ఞానం ఉపయోగపడాలి. తుపానులను అంచనా వేయడంలో మరింత నైపుణ్యం సాధించాలి. వాతావరణ మార్పులను మరింత కచ్చితంగా తెలుసుకోవాలి" అని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.

# సంపాదకీయం

## జనాభా పెంచేందుకు చైనా తిప్పలు

పొరుగు దేశం చైనా లో జనాభా సంఖ్య తగ్గుతూ వస్తున్నది. జనాభా తగ్గుదల కు కారణాలు అనేకం ఉన్నాయి. ఈ జనాభా పెంచేందుకు చైనా ప్రభుత్వం కొత్త కొత్త చట్టాల ను రూపొందిస్తున్నది. ఇప్పటికే ఒకే బిడ్డ విధానాన్ని సడలించింది. అలాగే పలు పన్ను రాయితీలు ప్రకటించింది. అయినా.. జనాభా పెరుగకపోవడంతో మరో కొత్త నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే పిల్లల ను కనే వారికి అనేక సంక్షేమ పథకాల ను ప్రవేశ పెట్టింది. అయినప్పటికీ యువత ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చైనా లో జనాభా పెరుగుదల కు ఏకంగా 16 పునరుత్పత్తి కేంద్రాల ను ఏర్పాటు చేయడానికి బీజింగ్ ప్రభుత్వం సిద్ధ పడింది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన కేంద్రాల ను జులై 1 నుంచి ప్రారంభించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. చైనా లో జననాల రేటు ను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక వచ్చే నెల 1వ తేదీ నుంచి నగరంలో 16 రకాల సహాయక పునరుత్పత్తి కేంద్రాల ను ప్రారంభించనుంది. ఇన్-విట్రో ఫెర్టిలైజేషన్ ఎంబ్రియో ట్రాన్స్ప్లాంటేషన్ గడ్ దకట్టడం వీర్యాన్ని నిల్వ చేయడం వంటి కొన్ని చికిత్సలు ప్రాథమిక బీమా కింద చేర్చబడతాయని బీజింగ్ మున్సిపల్ మెడికల్ ఇన్సూరెన్స్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ డు జిన్ తెలిపారు. గత 60 ఏళ్లలో చైనా లో జనాభా మరింత తగ్గిపోయింది. దీనితో చైనా ప్రభుత్వం ఈ చర్యల ను చేపట్టింది. నవజాత శిశువుల సంఖ్య గత సంవత్సరం రికార్డు స్థాయిలో 1000 మందికి 6.77కి పడిపోయిందని తేలింది. 2023లో ఇది మరింత తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. సంతానోత్పత్తి రేటును పెంచడానికి మద్దతు ఇచ్చే విధానాల పై చైనా జాతీయ ఆరోగ్య కమిషన్ గత ఆగస్టులో ప్రావిన్సుల కు మార్గదర్శకాలను జారీ చేసిన విషయం తెలిసింది.

దేశవ్యాప్తంగా ఉన్న అవివాహిత మహిళలు తప్పనిసరి గా వివాహం చేసుకోవాలనే జాతీయ నియమం కారణంగా ఐవీఎఫ్ గుడ్డు ఫ్రీజింగ్ టెక్నాలజీల వంటి సంతానో త్పత్తి చికిత్సలను పొందడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో నైరుతి సిచు వాన్ ప్రావిన్స్ లోని కొన్ని ప్రైవేట్ క్లినిక్లు ఇప్పటికే పడిపోతున్న జననాల కారణం గా ఐవీఎఫ్‌ని అనుమతించడం ప్రారం భించాయి. ఇలా మొత్తానికి చైనా జనాభా పెంచేందుకు ముప్పు తిప్పలు పడుతోంది.

# ఏజెన్సీ వనరులపై నిర్లక్ష్యం..!



కొత్తగూడ : కొత్తగూడ మండలం ఏజెన్సీలో నిక్షేప వనరులు మెండుగా నెలకొన్నాయి.. వనరుల సద్వినియోగంతో ఇక్కడి గిరిజనులకు ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో బొగ్గు, చైనాక్లే (తెల్లబంకమట్టి) నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ నిక్షేపాల వినియోగంపై పాలకులు దృష్టిసారించడంపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఉపాధి అవకాశాల కోసం ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ చర్యతో ఏజెన్సీ గ్రామాల్లోని ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా పురోభివృద్ధిని పొందుతారు. పోడు వ్యవసాయం, ఇతర అటవీ ఉత్పత్తులపై ఆధారపడుతూ జీవించే ఆదివాసీలకు ఇక్కడి వనరులతో ఉపాధి మార్గాలను చూపించేందుకు అనువైన ప్రాంతంగా కొత్తగూడ, గంగారం మండలాలున్నాయి. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి అవకాశాలను కల్పించాలని స్థానిక ఆదివాసీలు కోరుతున్నారు.

**మడగూడలో 'చైనాక్లే' నిక్షేపాలు**

గంగారం మండలం మడగూడ గ్రామ శివారులో చైనాక్లే నిక్షేపాలు పుష్కలంగా నెలకొన్నాయి. ఈ ప్రాంతపు గిరిజనులు ఉపాధి పొందేందుకు వాగుల ప్రాంతంలో తేలిన చైనాక్లే నిక్షేపాలను తవ్వి వెలికి తీసి సున్నంరాయిగా భావించి వినియోగిస్తున్నారు. కొందరు చాలా తక్కువ ధరకు వీటిని విక్రయిస్తుండడంతో వీరి కష్టానికి తగిన ఫలితం దక్కడం లేదు. ఇక్కడి నిక్షేపాలను పరీక్షించిన భూగర్భశాఖ అధికారులు ఇవి సున్నంరాయి కాదని నాణ్యమైన 'చైనాక్లే' నిక్షేపమని పేర్కొన్నారు. దీని ద్వారా సిరామిక్ పరిశ్రమలు నెలకొల్పవచ్చని సూచించారు. కప్పులు, సాసర్లు, గ్లాసులు, టైల్స్ లాంటి పరికరాలను ఉత్పత్తి చేయవచ్చన్నారు.

**బొగ్గు వెలికితీతో ఉపాధి**

కొత్తగూడ, గంగారం మండలాల్లోని గ్రామాల్లోని భూగర్భంలో బొగ్గునిల్వలు ఉన్నట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. భూగర్భంలోని బొగ్గు నిక్షేపాలు కొన్ని ప్రాంతాల్లో భూమిపై పొర కిందనే దర్శనమిస్తున్నాయి. పూనుగొండ్ల గ్రామశివారులోని పుల్సంవాగులో వరద తీవ్రతకు కోతకు గురైనా వాగులో బొగ్గు నిల్వలు బయటపడ్డాయి. కొత్తగూడ, గంగారం మండలంలోని భూగర్భంలో బొగ్గు నిక్షేపాలున్నట్లు అధికారులు గుర్తించారు. పూనుగొండ్లవాగులోని బొగ్గునిక్షేపాలను పలువురు అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి.

**ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం– నరేశ్, జిల్లా మైనింగ్ అధికారి**

మడగూడలోని చైనాక్లే నిల్వలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా. స్థానికంగా పరిశ్రమలు నెలకొల్పి స్థానికులు ఉపాధి పొందేలా చర్యలు చేపడతాం. మడగూడలోని చైనాక్లే నిల్వల ప్రాంతాన్ని సందర్శించి చర్యలను వేగవంతం చేస్తాం.

**ఉపాధి అవకాశాలు కల్పించాలి– బచ్చల వెంకటయ్య, పందెం**

మండలంలోని ప్రజలకు ఉపాధి మార్గాలు చూపించాలి. యువకులు ఉపాధి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈమేరకు ప్రత్యేక కార్యాచరణ చూపాలి. స్థానిక వనరులపై దృష్టి సారించి ఉపాధి అవకాశాలు కల్పించాలి.

**పోడుసాగుపై ఆధారపడుతున్నాం– బూర్క యాదగిరి, గంగారం**

ఏజెన్సీ గిరిజనులకు ఉపాధి అవకాశాలేపోవడంతోనే పోడు వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. ఉపాధి మార్గాలు చూపిస్తే యువత ఆర్థిక ఇబ్బందులు పడకుండా వారి తల్లిదండ్రులపై భారంగా పడకుండా ఉంటారు. మడగూడలోని నిక్షేపాలపై పరిశ్రమలు నెలకొల్పేందుకు రాజకీయ పార్టీ నేతలు దృష్టిసారించి గిరిజన యువతకు ఉపాధి మార్గాలను చూపించాలి.

**పరిశ్రమ ఏర్పాటు చేయాలి– యాప భద్రమ్మ, మడగూడ మాజీ సర్పంచి**

గ్రామంలో ఉన్నటువంటి సున్నంరాయి వెలికితీతపై ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పాలి. ఇక్కడి గిరిజనులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఉపాధి కోసం సున్నం రాయిని సేకరించి పట్టణప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించి ఉపాధి పొందుతారు. నిక్షేపాల వినియోగం ప్రభుత్వం దృష్టిసారించాలి.

# భూ హక్కు.. ఎప్పటికి దక్కు!

కొత్తగూడ : చిన్న, సన్నకారు రైతులకు సాదాబైనామా దరఖాస్తుల ద్వారా భూ హక్కు లభిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. 2014 జూన్ 2 కంటే ముందు సాదాబైనామా కింద కొనుగోలు చేసిన భూములకు హక్కులు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.. తెల్లకాగితాలు, స్టాంప్ కాగితాలు, నోటిమాట ద్వారా రిజిస్టర్ కాకుండా దస్తావేజుల ద్వారా భూములు కొనుగోలు చేసుకున్న రైతులు మీ సేవ కేంద్రాల్లో రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ రుసుం లేకుండా కేవలం యూజర్ ఛార్జీలు మాత్రమే తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. అటు ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం రాగా, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు కొందరు రహస్యంగా దస్తావేజుల విక్రయాలు జరిపి జేబులు నింపుకొన్నారు. కానీ, నేటికీ ఒక్కటంటే ఒక్క సాదా బైనామా దరఖాస్తుకు పట్టా మంజూరు కాకపోవడం శోచనీయం.. తాజాగా పోడు భూముల దరఖాస్తులకు హక్కు పత్రాలు ఇచ్చే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఈ క్రమంలోనే సాదాబైనామా దరఖాస్తులను కూడా ప్రభుత్వం ఎప్పుడు పరిష్కరిస్తుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు. సాదాబైనామా కింద కొనుగోలు చేసిన భూములకు చట్టబద్ధత కోసం ప్రభుత్వం 2020 నవంబరు 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరించిన విషయం తెలిసిందే. జిల్లాలోని 11 మండలాల నుంచి మొత్తం 51,347 దరఖాస్తులు వచ్చాయి. పలిమెల మండలంలో అతి తక్కువగా 384 దరఖాస్తులు రాగా, అత్యధికంగా భూపాలపల్లి మండలంలో 14,150 దరఖాస్తులు వచ్చాయి. 2016లో తొలిసారిగా అవకాశం కల్పించడంతో వేలాది మంది రైతులు లబ్ధిపొందారు. రెండేళ్లుగా సాదాబైనామా భూ పత్రాల జారీలో అడ్డంకులు లేకపోగా, ధరణి పోర్టల్‌లో నమోదైన సమాచారంతో భూములు చేతులు మారుతున్నాయని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

**ఆంక్షల తిరకాసు**

భూ రికార్డుల యాజమాన్య హక్కులు(ఆర్వోఆర్) చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం లేకపోవడంతో 1971 ఆర్వోఆర్ చట్టంలోని క్లాజ్‌లను చేరుస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నూతన రెవెన్యూ చట్టంలో క్రమబద్ధీకరణకు సంబంధించి విధి విధానాలు లేవు. కొత్త చట్టాన్ని సవరించాలనే ప్రయత్నం ముందుకు సాగడం లేదు. భూ హక్కులు పొందేందుకు వివిధ ఆంక్షలు బాధిత రైతులకు శాపంగా మారాయి. చట్టబద్ధత కల్పిస్తే అయిదెకరాల్లోపు వ్యవసాయ భూములను ఉచితంగా క్రమబద్ధీకరించనున్నారు.

**పొంచి ఉన్న ప్రమాదం**

రెవెన్యూ చట్టం ఆధారంగా ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి, భూముల క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట కొనుగోలు చేసిన భూములు ఆన్‌లైన్‌లో సదరు పట్టాదారు పేరుతోనే కొనసాగుతున్నాయి. యాజమాన్య హక్కుల మార్పిడి జరగకపోవడంతో పాత యజమానుల వారసులు ధరణి పోర్టల్‌లోని సమాచారం



ఆధారంగా భూములను ఇతరులకు విక్రయించే ప్రమాదం ఉంది. ఈ వెసులుబాటుతోనే రికార్డుల్లో పేర్లు మారుతున్నాయని బాధితులు కొందరు ఆందోళన చెందుతున్నారు. భూములను సాగు చేసుకుంటూ, ప్రతిఫలం అనుభవిస్తున్నప్పటికీ పట్టా హక్కులు లభించడం లేదు.

**రైతుల ఆశలు ఆవిరేనా..**

కొన్ని దశబ్దాల భూ సమస్యలకు సాదాబైనామా ద్వారా పరిష్కారం దొరుకుతుందని ఆశ పడిన చిన్న, సన్నకారు రైతుల ఆశలు ఆవిరయ్యాయి. పట్టా భూములకు మాత్రమే ప్రభుత్వ పథకాలైన రైతుబంధు, రైతు బీమా, బ్యాంకుల్లో రుణాలు వర్తింపజేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కూడా అందుతుంది. సాదాబైనామా ద్వారా పట్టాలు వస్తే తాము కూడా ప్రభుత్వ పథకాలు పొందవచ్చనే ఆశలో ఉన్న రైతుల ఆశలు అడియాసగానే మారుతోంది. సాదాబైనామాలో భూ హక్కు కోసం దరఖాస్తు చేసుకొని రెండేళ్లు దాటినా ఒక్క దరఖాస్తు కూడా పరిష్కారం లభించలేదు. దరఖాస్తుల పరిశీలన, పట్టాల మంజూరుకు సంబంధించి ఇంత వరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదని తహసీల్దార్లు పేర్కొంటున్నారు.

**భూమి ఉన్నా హక్కులు లేవు– శ్రీనివాస్‌రెడ్డి, ఆజంనగర్**

గ్రామంలోని ఒక సర్వే నంబర్‌లో సాదా బైనామాతో 2.20 ఎకరాల భూమిని కొనుగోలు చేశాను. పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నా.. ఆ భూమి అమ్మిన వ్యక్తి వాంగ్మూలం ఇచ్చాడు. ఏళ్ల తరబడి హక్కుల కోసం ఎదురుచూస్తున్నా.. భూమి ఉన్నా పట్టా హక్కులు లేవు. ఏ ఇతర లావాదేవీలకు పనిచేయడం లేదు.

**పథకాలు అందక ఇబ్బందులు..– మాచర్ల రవి, కమలాపూర్**

తెల్లకాగితంపై రాసుకున్న ఒప్పందంతో ఎకరం భూమిని కొనుగోలు చేశాను. రెండేళ్ల కిందట పట్టా హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నా.. అన్ని ధ్రువపత్రాలను సమర్పించాను. రైతు బంధు, పంట రుణం అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెట్టుబడి అవసరాలకు అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

# శిఖం మాయం.. రైతులు ఆగం

మాక్లూర్ : అక్రమార్కుల ఆగడాలకు అడ్డు, అదుపు లేకుండా పోతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఎలాగైనా సరే దానిని సొంతం చేసుకుంటున్నారు. యథేచ్ఛగా అందులో పంటలు సాగు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**పదెకరాలు హాంఫట్**

మాక్లూర్ మండలం మాందాపూర్ శివారులో ఎర్రకుంట చెరువు ఒకప్పుడు 26 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. ప్రస్తుతం అది 16 ఎకరాలకు కుంచించుకుపోయింది. లక్మాపూర్, మాందాపూర్ గ్రామాలకు చెందిన కొందరు 10 ఎకరాల శిఖం ఆక్రమించుకున్నారు.



అందులో బోర్లు వేసి ఎంచక్కా పంటలు పండిస్తున్నారు. అక్కడ ఎకరం భూమి రూ. 40 లక్షలు పలుకుతోంది. ఈ లెక్కన స్వార్థపరుల కబంధ హస్తాల్లో చిక్కుకున్న స్థలం విలువ రూ. 4 కోట్లు ఉంటుంది.

**ఆనవాళ్లు కోల్పోతోంది**

గతంలో ఎర్రకుంట చెరువు కింద 70 ఎకరాల ఆయకట్టు ఉండి కర్షకుల కళ్లల్లో ఆనందం నింపింది. అలాంటిది మెల్లిమెల్లిగా ఆనవాళు కోల్పోతోంది. ఎన్నో ఏళ్లుగా చుట్టూ పచ్చని పొలాలతో కళకళలాడిన భూముల్లో ప్రస్తుతం సగం బీడుగా మారిపోయాయి. ఈ క్రమంలో ఏం చేయాలో తెలియక అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

**ఫిర్యాదు చేసినా ఫలితం లేదు : పోశెట్టి, వీడీసీ సభ్యుడు**

శిఖం కబ్జాపై మూడేళ్ల నుంచి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా లాభం లేదు. విచారణ జరుపుతున్నామని పైకి చెబుతున్నా.. ఎవరూ క్షేత్రస్థాయికి రావడం లేదు. ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలి.

**సర్వే జరిపిస్తాం : శంకర్, తహసీల్దార్**

రైతుల పొలాలకు దారి కోసం కొంత శిఖం భూమి కేటాయించాం. పదెకరాల స్థలం ఆక్రమణకు గురైన విషయం నాకు తెలియదు. వెంటనే సర్వే నిర్వహించి కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం.

# పిల్లలూ.. జర పైలం

నిజామాబాద్ : అంతర్జాలం.. ప్రతి ఒక్కరి జీవితాన్ని ప్రభావితం చేస్తున్న సాంకేతిక సదుపాయం. ఇది ఎంత సౌకర్యవంతమో అంతలా ప్రమాదకరంగానూ మారిందని పలు ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏటా ఫిబ్రవరిలో 'సురక్షిత అంతర్జాల దినోత్సవం' నిర్వహించాలని కొన్ని దేశాలు నిర్ణయించాయి. పిల్లలు మొదలు అన్నివర్గాల వినియోగదారుల్లో సురక్షిత ఇంటర్నెట్ విధానాలపై అవగాహన పెంపొందించడానికి ప్రయత్నిస్తున్నారు.

**చిన్నారులు, యువత..**

ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం పిల్లలు, యువత ఉంటున్నారు. అనేక సాంకేతిక విషయాలపై వీరికి అవగాహన ఉంటున్నా.. సురక్షిత విధానంలో వినియోగించడంలో విఫలమవుతున్నారు. ప్రధానంగా వ్యక్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. వివిధ ప్రకటనలకు ఆకర్షితులై ఊబిలో చిక్కుకుపోతున్నారు. ఈ విషయం తెలుసుకునేలోగా నష్టం జరిగిపోతోంది. విద్య, ఉద్యోగ నైపుణ్యాల వరకు యువత.. ఇంటర్నెట్‌ను వాడటం శ్రేయస్కరం.

**తల్లిదండ్రులు, సంరక్షకులు**

కుటుంబ పెద్దలుగా పిల్లలను సంరక్షించడం వారి బాధ్యత. కరోనా అనంతరం ఆన్‌లైన్ తరగతుల కారణంగా ఇంటర్నెట్ వాడకం తప్పనిసరైంది. వారు చదువుల పేరుతో ఏం చేస్తున్నారో పెద్దలు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ గేమ్స్, సామాజిక మాధ్యమాలు, ఈ-కామర్స్ వంటి విషయాల్లో వారి వ్యవహారశైలి గమనించాలి.

**గురువులైతే..**

ఇంటర్నెట్ ద్వారా విస్తృతంగా సమాచారాన్ని సేకరించవచ్చు. బోధన నైపుణ్యాల పెంపు, విషయ పరిజ్ఞానానికి ఉపయోగించుకునే క్రమంలో విద్యార్థులకు భద్రతాపరమైన అంశాలు బోధించాలి. తగిన జాగ్రత్తలు వివరించాలి.

సంస్థలు, ఉద్యోగులైతే భద్రతాపరమైన సాఫ్ట్‌వేర్, అప్లికేషన్లు వాడాలి. 8-12 మధ్య వయసుల్లోని 10 మంది పిల్లల్లో ఆరుగురు ఆన్‌లైన్ ప్రమాద బాధితులవుతున్నారు. ఇద్దరిలో ఒకరు సైబర్ బెదిరింపులు ఎదుర్కొంటున్నారు.



పిల్లల్లో 65 శాతం మంది ఆన్‌లైన్ సేవలు వాడుతున్నారు.

**1930..**

సైబర్ నేరాల ద్వారా నష్టపోయిన సొమ్మును తిరిగి పొందడానికి నిర్దేశించిన టోల్‌ఫ్రీ నంబరు ఇది. 24 గంటల్లోగా ఈ నంబరుకు ఫిర్యాదు చేస్తే వారి ఖాతాలు ఫ్రీజ్ చేసి సాంకేతిక ఆధారాలతో రికవరీ చేస్తారు.

**ఇవి పాటించాలి..**

ఆన్‌లైన్ లావాదేవీలకు బలమైన పాస్‌వర్డ్ పెట్టుకోవాలి.
బహిరంగ ప్రదేశాల్లోని వైఫై బ్రౌజింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి.
వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దు.
స్కామ్‌ల విషయంలో సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేయాలి.
నకిలీ వెబ్‌సైట్లను గుర్తించాలి.
అపరిచిత సందేశాలు, మెయిల్స్‌కు స్పందించొద్దు.

**సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నేడు**

సురక్షిత అంతర్జాల దినోత్సవం సందర్భంగా ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు జరగనుంది. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని చింతల బాలరాజ్‌గౌడ్ స్మారక ఆడిటోరియంలో దీనిని నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నారు. సైబర్ నేరాల నియంత్రణ అధికారులు భాగస్వాములు కానున్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీతో నగదు కాజేయడం, బ్యాంకుల్లో లావాదేవీల విషయంలో సైబర్ మోసాలు, ఏటీఎంల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించనున్నారు.

# వాగొస్తే వణుకే!

జగిత్యాల : కోరుట్ల పట్టణంలోని ఫుల్‌వాగు పరిసర ప్రాంతం ఇటీవలి వర్షాలకు అతలాకుతలమైంది. ఉదయం ఒక్కసారిగా వచ్చిన వరద ఉధృతి పెరిగి నీరు ఇళ్లలోకి రావడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. కొన్ని ఇళ్లు ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోగా కట్టుబట్టలు తప్ప ఏమీ మిగలని దయనీయ పరిస్థితి ఏర్పడింది. కొందరు బంధువుల ఇళ్లలో తలదాచుకోగా మరికొందరు ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో గడిపారు. కాలనీవాసులు, దాతలు అన్నదానం, సహాయక చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి ఫుల్‌వాగు పరివాహక ప్రాంతంలోని ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. అక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

అక్రమ నిర్మాణాలను కట్టడిచేయాలి..ఫుల్‌వాగు గత ఆనవాళ్లను కోల్పోయింది. అక్రమ నిర్మాణాలతో వాగును చిన్న కాలువగా మార్చేశారు. వాగు పరివాహక ప్రాంతాన్ని కొందరు అక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడమే కాకుండా



వాటిని కొందరు విక్రయించి సొమ్ము చేసుకోగా మరి కొందరు అద్దెకు ఇచ్చి ఆదాయాన్ని గడిస్తున్నారు. ఫుల్‌వాగు పరివాహక ప్రాంతాన్ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలి. బఫర్‌జోన్‌లో ఎలాంటి ఇంటి నిర్మాణాలు చేపట్టకుండా అధికారులు చర్యలు తీసుకుంటే ఇక ముందు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ఉంటుంది.

ప్రభుత్వ స్థలాలు ఇవ్వాలిఇటీవల ఎమ్మెల్యే కాలనీలో పర్యటించినప్పుడు ఇంట్లో సామగ్రి వర్షానికి కొట్టుకుపోయిందని, ఇళ్లు కూలిపోయాయని, కట్టుబట్టలు మాత్రమే మిగిలాయని ప్రజలు తమగోడు వెల్లబోసుకున్నారు. వర్షాల వల్ల ఇళ్లు కోల్పోయి నష్టపోయిన వారిని గుర్తించడంతో పాటు, అద్దెకు ఉన్న వారికి మరో చోట ప్రభుత్వ స్థలం ఇప్పించి ఆశ్రయం కల్పించాలని కాలనీవాసులు వేడుకున్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి, నిరుపేదలకు సంగెం రోడ్డు జంబిగద్దె ప్రభుత్వ స్థలంలో 75 గజాల స్థలం ఇప్పించి, రూ.3 లక్షల గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# పల్లెల లోగిళ్లలో.. సేవల జల్లు..!

కోదాడ : పేదలకు నాణ్యమైన ఉచితవిద్య, ఆర్థికసాయంతో ఆసరా కల్పించటం వంటి సామాజిక సేవలో ఫౌండేషన్లు చురుకుగా పనిచేస్తున్నాయి. కష్టనష్టాల కోర్చి ఎదిగిన సామాన్యులే ఫౌండేషన్లు ఏర్పాటు చేసి నిరుపేదలకు సాయం చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.ప్రభుత్వ బడులకు కస్తూరి సౌరభం... స్నేహితులతో కలిసి కస్తూరి ఫౌండేషన్‌ను స్థాపించి ఏడేళ్లుగా ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పేద పిల్లలు విద్యాభ్యాసం చేసే ప్రభుత్వబడులను బలోపేతం చేస్తున్నాడు నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన కస్తూరి శ్రీచరణ్. పేద విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించటం ద్వారా సమాజం ఉన్నతస్థితికి చేరుకుంటుందని బలంగా నమ్మి తనతో పాటు పనిచేసే కొంతమంది స్నేహితులతో కలిసి 2017లో కస్తూరి ఫౌండేషన్ స్థాపించారు.ప్రభుత్వ బడుల్లో పేద విద్యార్థులకు స్టడీమెటీరియల్, ఇంగ్లీష్ డిక్షనరీలు, గ్రామర్ పుస్తకాలు అందిస్తూ 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.10 వేల ఆర్థిక సాయం, పాఠశాలలకు బెంచీలు, కుర్చీలు, విద్యార్థులకు పుస్తకాల బ్యాగులు అందించారు. పాఠశాలలకు విద్యుత్తు సౌకర్యం, గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. తరగతి గదులకు మరమ్మతులు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం, మరమ్మతులు, ఎల్‌సీడీ ప్రొజెక్టర్లు, సౌండ్ సిస్టమ్‌లు, ఫ్యాన్లు, ప్రహరీలు, తరగతి గదులకు రంగులు, దేశభక్తుల చిత్రాలు వేయించే కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో వందకుపైగా పాఠశాలలను ఎంచుకుని అవసరమైన అన్ని వసతులు కల్పించారు. ఇందుక ఫౌండేషన్ నుంచి రూ.3 కోట్ల వరకు, విద్యార్థుల ప్రగతి ప్రోత్సాహకాలకు రూ.2 కోట్ల వరకు వెచ్చించారు. ప్రస్తుతం కస్తూర్బా ఆశ్రమపాఠశాలల్లో పూర్తి మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

కొనసాగిస్తా.. కస్తూరి శ్రీచరణ్

వీలైనన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తా. కొంతమంది జీవితాలు బాగుపడినా చాలు అనే భావనతో ముందుకు సాగుతున్నా. ఇలా సేవలు చేయటంలో ఎంతో తృప్తి ఉంది. దీనికి ఎందరో సహకరిస్తున్నారు.

ఆపన్నులకు ఆసరా

మన సాగర్–మెరుగైన సాగర్ నినాదంతో బుసిరెడ్డి ఫౌండేషన్ ఏడాదిగా పేదలకు అండగా నిలుస్తోంది. ఆపన్నులకు అసరా అవుతోంది. తిరుమలగిరి మండలం కొంపల్లికి చెందిన బుసిరెడ్డి పాండురంగారెడ్డి హైదరాబాద్‌లో బిల్డర్‌గా స్థిరపడ్డారు. హైదరాబాద్‌లో వైష్ణవి ఇన్‌ఫ్రా ఇండియా లిమిటెడ్ కంపెనీకి ఛైర్మన్‌గా, క్రెడాయ్‌కు ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. గత ఏప్రిల్‌లో బుసిరెడ్డి ఫౌండేషన్ స్థాపించి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, నిరుపేదలైన విద్యార్థులు, దివ్యాంగులు, వితంతువులు, అనాథలకు ఆర్థికసాయం, కూలీలకు లంచ్‌బ్యాగులు అందించారు. రైతులకు జింక్ ఎరువులు, 600 ఎకరాల్లో డ్రోన్ సాయంతో ఉచితంగా పురుగుమందుల పిచికారి చేయటం, వివిధ దేవాలయాలకు విరాళాలు, వీధి వ్యాపారులకు గొడుగులు అందజేశారు. కృష్ణానది ఒడ్డున గుట్టలమీద ఉన్న నాగార్జునపేటలో బోరుపైపులైన్ ఏర్పాటుచేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. 500 కుటుంబాల్లో అంత్యక్రియలకు అన్నదానం ఏర్పాటుచేశారు. పేదల కళ్లల్లో వెలుగు చూడటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పాండురంగారెడ్డి అంటున్నారు.

పేద బాలికలకు విద్యపెద్దవూర మండలం చింతపల్లికి చెందిన కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి 2014లో సేవ్ గర్ల్ ఛైల్డ్ లక్ష్యంతో కేసీఆర్ ఫౌండేషన్ స్థాపించి సేవలను అందిస్తున్నారు. ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్యపై పోరాడటమేకాక, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ప్రస్తుతం పేద బాలికల విద్య లక్ష్యంతో పనిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, తండాల్లో బాలికలను అమ్ముకునే దుస్థితిపై దృష్టి సారించారు. బాలికలను చదివిస్తూ వారికి ఆర్థికసాయం చేస్తున్నారు. సమాజసేవలో ఎంతో తృప్తి ఉందని దాన్ని ఆస్వాదిస్తున్నానని చంద్రశేఖర్‌రెడ్డి చెబుతుంటారు.రాత్రి బడులతో పల్‌రెడ్డి ఫౌండేషన్‌పగలు పనిచేసుకునే యువకులకు రాత్రి బడులు ఏర్పాటుచేయటం, అక్షర జ్ఞానం కల్పించే లక్ష్యంతో హాలియా కేంద్రంగా పల్‌రెడ్డి శాంతి, శ్యామ్‌రెడ్డి అనే ఎన్నారై దంపతులు 2021లో పల్‌రెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. జిల్లాలో సుమారు 90 అభ్యాసిక అనే పాఠశాలలు ఏర్పాటుచేసి రాత్రి వేళల్లో విద్యార్థులకు నైపుణ్యాలు మెరుగుపడేలా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నచోట రూ.6500 వేతనం ఇచ్చి వివిధ పాఠశాలల్లో 25 మంది ట్యూటర్లను ఏర్పాటుచేసి నిర్వహిస్తున్నారు.

# ఆధిపత్యానికి చెక్

గద్వాల : చేపల చెరువుల లీజు బాధ్యత మత్స్య శాఖ పరిధిలోకి వెళ్లిపోయింది.. ఇందుకు సంబంధించి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జీవోను జారీ చేసింది.. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లు చెరువులపై ఆధిపత్యం చలాయిస్తూ వస్తున్న ప్రజాప్రతినిధుల అక్రమాలకు చెక్ పడనుంది.. శ్రమ దోపిడీకి గురవుతున్న మత్స్యకారులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఊరట లభించనున్నది..

మత్స్యకారులను ప్రోత్సహించాలనే ఉ ద్దేశంతో ప్రభుత్వం ఏటా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో ఉ చితంగా చేప పిల్లలను వదిలి, మత్స్యకారులకు ఉపాధి అవకాశా లు కల్పిస్తోంది. మార్కెట్ సౌకర్యం మెరుగుపర్చేందుకు వీరికి సబ్సి డీపై వాహనాలు, ఉచితంగా చేపలు పట్టే పరికరాలు అందజేసింది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసింది. ఇప్పటి వరకు వంద ఎ కరాలకు పైగా ఆయకట్టు ఉన్న చెరువుల లీజు బాధ్యతను మత్స్య శాఖ పరిధిలో ఉండగా, తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం వంద ఎకరాల ఆయకట్టులోపు ఉన్న చెరువులను కూడా మత్స్య శాఖ పరిధిలోకి తీసుకొస్తూ, జీవో 268ను జారీ చేసింది. అ యితే, ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల పాలక వర్గాలు తమకు అనుకూలంగా ఉన్న సొసైటీలోని సభ్యులకు చేపల చెరువులను లీ జుకు ఇచ్చి అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చెరువుల లీజు బాధ్యతను మత్స్య శాఖ కు అప్పగించిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. లీజు ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి విని యోగించనున్నట్లు తెలిసింది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో వంద ఎకరాలలోపు ఆయకట్టు ఉ న్న చెరువులు 300, వంద ఎకరాలకంటే ఎక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు 40 వరకు ఉన్నాయి. ఇక నుంచి ఈ మొత్తం చెరువుల లీజు బాధ్యతను మత్స్య శాఖ పర్యవేక్షించనుంది. వాస్తవానికి చేప ల చెరువు లీజును గతంలో మత్స్య సహకార సంఘాలు తమలో తాము బృందాలుగా ఏర్పడి , చెరువులను లీజుకు తీసుకొని ప్ర భుత్వం నిర్దేశించిన మేరకు లీజు సొమ్మును మత్స్య శాఖకు చెల్లించేవి. ఉ దాహరణకు ఒక చెరువుకు ఏడాదికి లీజు రూ.10 వేలు ఉందనుకుంటే, దానికంటే ఎక్కువగా సంఘం సభ్యులు వేలంలో దక్కించుకునే వారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.10 వేలను మత్స్య శాఖకు చెల్లించి, మిగిలిన మొత్తాన్ని సభ్యులు సమానంగా పంచుకునే వారు. ఇలా లక్షలాది రూపాయలు మత్స్య సహకార సంఘా లు దక్కించుకునేవి. తాగాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేర కు చెరువులను మత్స్య శాఖ నేరుగా మత్స్య సహకార సంఘాలకు లీజు ఇచ్చే సమయంలో ఎవరు ఎక్కువ లీజు చెల్లించడానికి ముం దుకు వస్తారో, వారికే అవకాశం ఇవ్వనున్నారు. మొత్తం చెరువు లీ జు డబ్బులను వివిధ విభాగాలకు కేటాయించనున్నారు. 50 శాతం లీజు సొమ్మును సాగునీటీ సంఘాలకు, 30 శాతం నిధులను గ్రా మ పంచాయతీల అభివృద్ధికి, 20 శాతం నిధులు మత్స్య శాఖకు కే టాయించనున్నారు. అయితే, చెరువుల లీజు సమయంలో గతంలో లాగా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు లీజు సొమ్ము తీసుకుని మిగిలిన సొమ్ములను సంఘాలకు అప్పగిస్తారా? లేదా? అనే అంశంపై స్పష్టత కోసం మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. లీజు మొత్తం సొమ్మలను ప్రభుత్వం పరమైతే, సంఘాల పరిస్థితి ఏంటని సభ్యు లు ప్రశ్నిస్తున్నారు.

# దందా మళ్లీ మొదలు..!



గోదావరిఖని: ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ భూముల కబ్జాలు మళ్లీ మొదలయ్యాయి. కొద్ది రోజులుగా అక్రమ నిర్మాణాలు.. కబ్జాలకు దూరంగా ఉన్న అక్రమార్కులు మళ్లీ తమ దందాను మొదలు పెట్టారు. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీ మేడిపల్లి శివారులో పేదల కోసం కేటాయించిన ఇందిరమ్మ స్థలాలపై కన్నేసిన కొంత మంది రియల్ దందా మొదలు పెట్టారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం వంద ఎకరాల భూమిని సేకరించింది. అందులో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించగా మరో 15 ఎకరాల స్థలం మిగిలింది. దీనిపై కన్నేసిన కొంత మంది కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే కొంత మంది ఇందిరమ్మ స్థలాలను అక్రమించుకుని ఇళ్లు నిర్మించారు. మరి కొంతమంది ప్లాట్లుగా ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. కొంత మంది నకిలీ పట్టాలు సృష్టించి ఆయా స్థలాలను విక్రయించారు. దీనికి సంబంధించి గతంలో ఇద్దరిని తహసీల్దార్ ముందు బైండోవర్ కూడా చేశారు. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్న కొంతమంది ముఠాగా ఏర్పడి ఖాళీగా ఉన్న స్థలాన్ని కబ్జా చేసేందుకు గతంలో చదును చేశారు. ఈ విషయం బయటకు రావడంతో కొంత కాలం ఆక్రమణలు నిలిపివేసిన కబ్జాదారులు మళ్లీ తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. తాజాగా ఇందిరమ్మ స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. కందకాలు తవ్వి పునాదులు తీస్తున్నారు.

విలువైన భూములు ఆక్రమణల పర్వం

ఇళ్లు లేని పేదల కోసం ప్రభుత్వం రామగుండం మండలం మేడిపల్లి శివారులో 100 ఎకరాల భూమిని 2008లో ఎకరాకు రూ.5 లక్షలు చెల్లించి సేకరించింది. అందులో 85 ఎకరాలను ఇందిరమ్మ ఇళ్లతో పాటు పీకే రామయ్య కాలనీకి కేటాయించింది. మిగిలిపోయిన 15 ఎకరాల స్థలాన్ని కబ్జా చేసేందుకు గత కొంత కాలంగా ప్రయత్నిస్తున్న కబ్జాదారులు ఇప్పటికే కొంత భూమిని విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాట్లుగా మార్చి రూ.లక్షలు దండుకున్నారు. నకిలీ పట్టాలు సృష్టించి అమాయకులకు అంటగట్టారు. ఇందిరమ్మ స్థలంలో కొన్ని ఇళ్లు నిర్మించి విక్రయిస్తున్నారు. మిగిలిపోయిన కొంత భూమిని చదును చేసి ప్లాట్లుగా చేసి రియల్ దందా సాగించేందుకు ప్రయత్నించారు. విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో కొంతకాలం దందాను నిలిపివేసిన అక్రమార్కులు మళ్లీ అందులో నిర్మాణాలు చేపడుతున్నారు. కబ్జాదారుల కోరల్లో చిక్కుకుంటున్న ప్రభుత్వ స్థలాలు ముందుముందు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది. మేడిపల్లి శివారులోని ఇందిరమ్మ ప్రభుత్వ స్థలం కూడా కబ్జాదారుల చేతుల్లోకి చేరుతోంది. దీనిని రక్షించుకోవడానికి రెవెన్యూ అధికారులు అనేక సార్లు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా అక్రమార్కులు వాటిని ఖాతరు చేయడం లేదు. ఎన్టీపీసీ జ్యోతినగర్‌కు చెందిన కొంత మంది ముఠాగా ఏర్పడి అమాయకులకు అంటగడుతూ రూ.లక్షలు సంపాదిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని తమ దందాను నిరాటంకంగా సాగిస్తున్నట్లు వినికిడి.

కఠిన చర్యలు తప్పవు– కుమారస్వామి, రామగుండం తహసీల్దార్

ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవు. పేదల కోసం కేటాయించిన భూమిలో ఆక్రమణలకు పాల్పడితే కేసులు నమోదు చేయిస్తాం. ఇందిరమ్మకాలనీలో ప్రభుత్వ భూమి ఎంత ఉందో గుర్తించి హద్దులు ఏర్పాటు చేసుకుంటాం. ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు ఎవరైనా ప్రయత్నిస్తే స్థానికులు ఆ విషయాన్ని మాదృష్టికి తీసుకురావచ్చు. పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం.

# గోశాలకు బయోగ్యాస్ విద్యుత్తు

వేములవాడ: పశువుల పేడ ఆధారంగా ఏర్పాటు చేసిన బయోగ్యాస్ ఆధారిత విద్యుత్తు ప్లాంట్ విజయవంతంగా పని చేస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ గోశాలకు ఈ ప్లాంట్ ద్వారా సరఫరా చేస్తున్నారు. పట్టణంలో తిప్పాపూర్‌లోని రాజన్న ఆలయ గోశాలలో రూ. 31.60 లక్షల దేవస్థానం నిధులతో ఈ ప్లాంట్‌ను అధికారులు నిర్మించారు. ఇటీవల దీనిని ప్రారంభించారు. ఆవు, కోడెల పేడ ఆధారంగా దీనిని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం దీని నుంచి ఉత్పత్తి అయ్యే పర్యావరణ గ్రీన్ ఎనర్జీ విద్యుత్తు ప్రస్తుతం గోశాలకు రెండు నుంచి మూడు గంటల పాటు సరఫరా అవుతోంది. రోజూ గోశాల సిబ్బంది పది క్వింటాళ్ల పేడను వినియోగిస్తూ ఉత్పత్తి అయిన విద్యుత్తును గోశాలకు ఉపయోగిస్తున్నారు.



ఉత్పత్తి పెంచితే ప్రయోజనం

బయోగ్యాస్ ఆధారంగా ఉత్పత్తి అయిన విద్యుత్తును ప్రస్తుతం గోశాలకు మాత్రమే మూడు గంటల పాటు వినియోగిస్తున్నారు. ఉత్పత్తి పెంచితే వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రితో పాటు ఆలయ అవసరాలను తీర్చుకునేందుకు అవకాశం ఉంది. రోజూ 2.5 టన్నుల పేడను వినియోగించే సామర్థ్యం ఈ ప్లాంటుకు ఉంది. ఈ గోశాలలో దాదాపు రెండు వందల వరకు కోడెలు ఉన్నాయి. రోజూ పెద్ద ఎత్తున వస్తున్న వీటి పేడను వినియోగించి ఉత్పత్తి పెంచితే విద్యుత్తు అవసరాలు పూర్తిగా తీరే అవకాశం ఉంది. ఆ దిశగా ఆలయ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీంతో రాజన్న ఆలయానికి ప్రతి నెలా కరెంటు బిల్లుల ఖర్చులు తగ్గుతాయి. ఆలయ అధికారులు దీని విస్తరణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉత్పత్తి ఇలా...

బయోగ్యాస్ ప్లాంట్‌లోని శుద్ధి యంత్రానికి ముందుగా ఆవు, కోడెల పేడను పంపిస్తుంటారు. అక్కడి నుంచి పేడ శుద్ధి జరిగి గ్యాస్ హోల్డర్‌లోకి వెళ్లి గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. గ్యాస్ పైపు ద్వారా బయోగ్యాస్ జనరేటర్‌కు చేరుకుంటుంది. శుద్ధి జరిగిన పేడ గ్యాస్ హోల్డర్‌లోకి వెళ్లిన తరువాత గ్యాస్ తయారు కావడానికి 24 గంటల సమయం పడుతుంది. జనరేటర్ ఆన్ చేయడంతో విద్యుత్తు సరఫరా అవుతుంది. ఇలా రోజూ గోశాల సిబ్బంది దాదాపు 10 క్వింటాళ్ల పేడను వినియోగిస్తూ తయారైన విద్యుత్తును గోశాలకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం గోశాల సిబ్బంది ఒకరు దీని బాధ్యత చూస్తున్నారు. సిబ్బందిని పెంచి, ఉత్పత్తి కూడా పెంచితే ఉపయోగం ఉంటుంది.

తగినంత మంది సిబ్బంది లేక...– రఘునందన్, డీఈ, రాజన్న ఆలయంబయోగ్యాస్ ఆధారిత విద్యుత్తు ప్లాంట్ ద్వారా ప్రస్తుతం గోశాలకు విద్యుత్తు సరఫరా జరుగుతోంది. ఉత్పత్తి పెంచితే పక్కనున్న ఏరియా ఆసుపత్రికి, రాజన్న ఆలయానికి కూడా సరఫరా చేయడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం తగినంత మంది సిబ్బంది లేరు. గోశాల సిబ్బంది ఈ ప్లాంట్ బాధ్యతలు చూస్తున్నారు.

# ప్రత్యేక భవనం సమకూరేనా..!

గోదావరిఖని: ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కొత్త మండలాలు ఏర్పాటు చేసింది. అన్ని శాఖల కార్యాలయాలను మండల ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. కానీ అంతర్గాం మండలంలో ఏడేళ్లు గడచినా ఇంతవరకూ మండల విద్యా వనరుల కేంద్రం మాత్రం నేటికీ ఏర్పాటు కాలేదు. అన్ని కార్యాలయాలు మండలంలో ఏర్పాటు అయినప్పటికీ ఇక్కడ విద్యాశాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. 2016 అక్టోబరులో మండల కేంద్రమైన అంతర్గాంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అప్పటి విద్యాధికారులు ఓ తరగతి గదిలో ఎమ్మార్సీ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభిం చారు. అనంతరం ఆ విషయాన్ని మరచిపోయారు. ప్రధానంగా మండలానికి కేటాయించిన సిబ్బంది అక్కడ పనిచేయడానికి ఆసక్తి చూపడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు మాసాలు కావస్తున్నా ఇంతవరకూ కార్యాలయాన్ని తెరవలేదు. పైగా ఇక్కడి నాలుగు బీరువాలు, రెండు టేబుళ్లు, కుర్చీలు, ఒక కంప్యూటర్‌ను రామగుండం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి



తరలించారు. ఇక్కడి సిబ్బంది సైతం అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. పేరుకు అంతర్గాం మండలం అయినప్పటికి విద్యా సంబంధ పనికి రామగుండం పట్టణానికి రావాల్సిందే. ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తుల కోసం వచ్చిన దుస్తులు నిల్వ చేయడానికి, కుట్టిన జతలు వచ్చినపుడు పంపిణీ చేయడానికి, ఉపాధ్యాయులు నివేదికలు ఇవ్వడానికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రం నుంచి 5, 15 కిలోమీటర్ల దూరంలో 15 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 2 ఉన్నత, ఒక కేజీబీవీ, ఆదర్శ పాఠశాల ఉన్నాయి. వీటికి అవసరమైన సామగ్రిని రామగుండంలో నిల్వ చేయడం వల్ల రవాణాకు మరో 10 కిలోమీటర్లు అదనం అవుతున్నా యి. చాలారకాల ఉత్తర, ప్రత్యుత్తరాల కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక తపాలా సిబ్బంది సతమతం అవుతున్నారు. కార్యాలయానికి సంబంధించి కనీస చిరునామా లేదు. పక్కా భవనానికి నిధులు మంజూ రైనా స్థలం లేక భవనం నిర్మాణం చేపట్టలేకపోతున్నామని ఇన్‌ఛార్జి ఎంఈవో పి.సంపత్‌రావు తెలిపారు. గతనెలలో అదనంగా ముగ్గురు సిబ్బందిని కేటాయించారని... ప్రత్యేక భవనం లేక కార్యాలయం ఏర్పాటు కావడంలేదని తెలిపారు.

# రక్తశుద్ధి కేంద్రం తరలింపునకు యత్నం

గోదావరిఖని : రక్తశుద్ధి చేయించుకునే వారికి ముందస్తు సమాచారం లేకుండా గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలోని మొదటి అంతస్తులోఉన్న రక్తశుద్ధి కేంద్రాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చేందుకు చేసిన యత్నాలతో ఆసుపత్రిలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం రక్తశుద్ధి కేంద్రం నిర్వహిస్తున్న విభాగంలో నేత్ర శస్త్ర చికిత్స విభాగాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ట్రామాకేర్ కేంద్రం కోసం ఏర్పాటు చేసిన విభాగంలో రక్తశుద్ధి కేంద్రాన్ని తరలించేందుకు ఆసుపత్రి వర్గాలు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా డయాలసిస్ సేవలను నిలిపివేసి పడకలను గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి తరలించారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. డయాలసిస్ చేయించుకోవాల్సిన వారితో పాటు వారి సహాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో దూర ప్రాంతాల నుంచి గోదావరిఖనికి వచ్చిన వారు తమ ఆరోగ్యం క్షీణిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డయాలసిస్ కేంద్రాన్ని తరలించాలంటే శుద్ధజల కేంద్రంతో పాటు ప్రతీ పడకకు ఆక్సీజన్‌తో పాటు వివిధ సదుపాయాలకు సంబంధించిన పైపులైన్లు, ఎయిర్ కండీషనర్లు తదితర సదుపాయాలు ఉండాలి. కాగా కేవలం పడకలను తరలిస్తే చాలన్నట్లుగా ఆసుపత్రి వర్గాలు చర్యలు తీసుకోవడం ఆందోళనలకు దారి తీసింది. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందుసింగ్ రెసిడెంట్ మెడికల్ అధికారి రేణుకను పంపి వివరాలు తెలుసుకున్నారు.



ప్రస్తుతం యథావిధిగా రక్తశుద్ధి కొనసాగించాలని, గ్రౌండ్ ఫ్లోర్‌లోకి తరలించిన పడకలను తిరిగి తీసుకువెళ్లాలని ఆదేశించారు. దీంతో డయాలసిస్‌ను కొనసాగించారు.

ఆరుగంటల ప్రయాస– ప్రమీల, రామయ్యపల్లి(మంథని)

ఉదయం 10 గంటలకు రక్తశుద్ధి చేయించుకోవాల్సి ఉండడంతో ఆసుపత్రికి వచ్చాను. కేంద్రాన్ని తరలిస్తున్నామంటూ రక్తశుద్ధి చేయకపోవడంతో ఆరోగ్యం ఇబ్బందికరంగా మారింది. ఎట్టకేలకు సాయంత్రం నాలుగు గంటలకు రక్తశుద్ధి మొదలుపెట్టడంతో ఊపిరి పీల్చుకున్నా. వారంలో మూడు రోజులు తప్పనిసరిగా డయాలసిస్ చేయించుకోవాల్సిందే. గడువు మీరితే ఇబ్బందులు తప్పవు. అధికారులు మాకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి.

ఆయాసం పెరిగిందిదస్తగిరి, గోదావరిఖనిమూడు రోజుల క్రితం డయాలసిస్ చేయించుకున్నా. తిరిగి తప్పనిసరిగా చికిత్స చేయించుకోవాల్సిందే. నిర్ణీత సమయంలో రక్తశుద్ధి చేయకపోవడంతో ఆయాసం పెరిగింది. తరలింపు ప్రక్రియ చేపట్టాలనుకుంటే ముందస్తుగా సమాచారం ఇచ్చి ఏర్పాట్లు త్వరితగతిన చేపట్టాలి. రోగులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తే మేలు.

# పేదలే లక్ష్యంగా వసూళ్ల పర్వం..!

ఇల్లెందు : పేదలకు సొంతింటిపై ఉన్న ఆశలను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమార్కులు వసూళ్ల పర్వానికి తెగబడుతున్నారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు స్వీకరించి పరిశీలిస్తోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఇళ్ల నిర్మాణానికి వివరాలు పొందుపరుస్తామంటూ ఇల్లెందు మండలం బోయితండా, లక్ష్మీనారాయణతండా, బొంబాయితండా, మసివాగు, బద్రుతండాలో పలువురిని కొందరు దుండగులు బోల్తా కొట్టించారు. ఒక్కొక్కరికి రూ.5 లక్షల సాయమందుతుందని సుమారు 50 మంది నుంచి వివరాల నమోదుకు రూ.1,200 చొప్పున వసూలు చేసినట్లు



సమాచారం. ఇందుకోసం డబ్బులతో పాటు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నారు. ఓ జాతీయపార్టీ నాయకులు దృష్టి సారించటంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇలాంటి పథకమేదీ లేదని సదరు పార్టీ నాయకులు చెప్పటంతో డబ్బులివ్వాలని వసూలు చేసిన వారిపై బాధితులు ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. లక్ష్మీనారాయణతండాకు చెందిన ఓ యువకుడు అక్రమ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

కొమరారం ఠాణా పరిధిలోని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం కోసం డబ్బులు వసూలుచేసినట్లు ఫిర్యాదులు అందలేదు. అమాయకులను మోసగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రవీందర్, సీఐ, గుండాల

# అదును దాటినా అశ్రద్ధే..!

భానుపురి : ఉమ్మడి జిల్లాలోని చెరువులు మత్తడి దూకి నీటితో కళకళలాడుతున్నాయి. కానీ నేటికీ చేపపిల్లలను విడుదల చేయలేదు. మత్స్యకారుల ఉపాధికి ఏటా చెరువుల్లో రూ.కోట్ల వ్యయంతో చేప పిల్లలను ప్రభుత్వం వదులుతోంది. అధికారుల నిర్లక్ష్యం.. గుత్తేదారుల అలసత్వంతో ఈ పథకాన్ని నీరుగారుస్తున్నారు. జిల్లాలో ఈ పాటికే చెరువుల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమం పూర్తి కావాల్సి ఉండగా.. ఆగస్టు మూడోవారం గడుస్తున్నా పంపిణీ ప్రారంభించ లేదు.

పెరుగుదలపై అనుమానం

చెరువుల్లో చేప పిల్లలను అదనులోగా వదలకుంటే సరైన పరిమాణంలో పెరగక నష్టం జరుగుతుందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఏటా జూన్‌లో టెండర్లు పిలిచి జులై చివరి వారం నుంచి చెరువుల్లో చేప పిల్లల వదిలే బాధ్యతను గుత్తేదారులకు అప్పజెప్పేవారు. ఈసారి టెండర్లలో జాప్యం నెలకొంది. నిబంధనల మేరకు ఆగస్టు



మొదటి వారంలో చేప, రొయ్య విత్తనాల పంపిణీని ప్రారంభించి సెప్టెంబరు రెండోవారంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ అలాంటి కార్యక్రమాలేవి చేపట్టడం లేదు.

అక్రమాలకు అడ్డుకట్ట పడేదెలా..!

గతంలో నాణ్యతలేని చేప పిల్లలను సరఫరా చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. చెరువుల్లో నిబంధనల ప్రకారం చేప పిల్లలను వదలడం లేదని, పరిమాణం విషయంలోనూ అక్రమాలు జరుగుతున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చేప పిల్లల పంపిణీకి ప్రత్యేక విధానం అమలు చేస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. మత్స్యకారులకు అవగాహన కల్పించి... స్థానికంగా ఉత్పత్తి చేసిన చేప పిల్లలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలి. టెండర్‌లో నిర్దేశించిన మేరకు చెరువులు, కుంటలు, చిన్న నీటి వనరుల్లో 35 నుంచి 40 మిల్లీ లీటర్ల పరిమాణంలో ఉండే చేప పిల్లలను విడుదల చేసేలా చర్యలు చేపట్టాలి. జలాశయాల్లో 80-100 మిల్లీమీటర్ల పెద్ద పరిణామంలోనివి వదిలితేనే మత్స్యసంపద అభివృద్ధి చెందుతుంది.

# జ్వరభయం

చెన్నూరు : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పల్లెలు, పట్టణాల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతుండటంతో ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారు. పరిసరాల్లో అపరిశుభ్రతతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు కంటితుడుపుగా మాత్రమే ఉంటున్నాయి. దీంతో ప్రజలు వివిధ రుగ్మతలకు గురవుతూ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. గత పక్షం రోజులుగా చెన్నూరు సీహెచ్‌సీకి వస్తున్న రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. సీజనల్ వ్యాధులు పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.వర్షాల కారణంగా నెలకొన్న అపరిశుభ్రతతో ప్రస్తుతమైతే సాధారణ జ్వరాలు విజృంభిస్తున్నాయి. పట్టణాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. పల్లెల్లో జ్వరాల సంఖ్య ఎక్కువగానే నమోదవుతోంది. చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాల ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ప్రధాన కేంద్రంగా చెన్నూరు సీహెచ్‌సీ ఆసుపత్రి ఉంది. పట్టణంలోని పాత ఆసుపత్రి భవనాన్ని కూల్చి దాని స్థానంలో నూతనంగా ఆసుపత్రి భవనం నిర్మిస్తుండగా మండలంలోని ఎల్లక్కపేట సింగరేణి డిస్పెన్సరీలో సీహెచ్‌సీ కొనసాగుతోంది. 30 పడకలతో ఉన్న ఈ ఆసుపత్రిలో రోగుల తాకిడి పెరుగుతుండటంతో ఆసుపత్రిలో పడకలు సరిపోక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఆసుపత్రికి గత 15 రోజులుగా సుమారు 200 మందికిపైగా రోగులు వస్తుండగా వైద్యులు వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన రోగులకు ఆసుపత్రిలోనే ఉంచి చికిత్సలు అందిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న వారి సంఖ్య కూడా గత వారం రోజులుగా 60కిపైగా ఉంటోంది. సరిపడా పడకలు లేక ఒక్కో పడకపై ఇద్దరేసి రోగులను ఉంచి చికిత్సలు నిర్వహించాల్సి వస్తోంది. అడపాదడపా ఒకటి, రెండు డెంగీ, డయేరియాలాంటి కేసులు నమోదవుతుండగా మెరుగైన వైద్యం కోసం వారిని మంచిర్యాలకు సిఫారసు చేస్తున్నట్లు వైద్యులు తెలుపుతున్నారు.చెన్నూరు మండలం రాయిపేటలో ఇటీవల జ్వరాలు ప్రబలి అధికశాతం మంది మంచం పట్టారు. పలువురికి రక్తకణాలు తగ్గడంతో పరిస్థితి విషమించింది. గ్రామానికి చెందిన దాద ముత్తక్క అనే వార్డు సభ్యురాలు జ్వరంతో మృతి చెందింది. రెండో ఏఎన్ఎంలు సమ్మెబాట పట్టడంతో ఈ విషయం వైద్యులకు తెలియకపోవడం శోచనీయం.

# పట్టని ప్రణాళిక..



నిర్మల్ : నిర్మల్.. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతోంది. ఇళ్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరందుకున్నాయి. వీటి నిర్మాణ అనుమతి విషయంలో ప్రభుత్వం టీఎస్-బీపాస్ అమలులోకి తీసుకొచ్చినా.. అందుకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. ఫిర్యాదులు వచ్చిన వాటిపై దృష్టి సారిస్తున్న 'పుర' అధికారులు మిగతా వాటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అనుమతుల పరిశీలనకు వెళ్తున్న అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు ఉండటంతోనే నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇంటి నిర్మాణ అనుమతుల నిబంధనలు కఠినతరం చేయడంతో కొంతమంది అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్ చేయడంతో చాలా మంది దరఖాస్తులు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఆదర్శనగర్, సోఫినగర్, రాంనగర్, అస్రానగర్, గాయత్రినగర్, ప్రియదర్శినినగర్, శాస్త్రినగర్, విద్యానగర్, శాంతినగర్, తదితర ప్రాంతాల్లో నిబంధనలకు తూట్లు పొడుస్తూ అడ్డగోలు నిర్మాణాలు చేస్తున్నారు. పట్టణ ప్రణాళికకు విరుద్ధంగా నిర్మిస్తున్నా.. సంబంధిత అధికారులు చూస్తూ ఉండిపోవడం గమనార్హం. అనుమతులకు మించి నిర్మాణాలు చేస్తూ బల్దియాలకు రావాల్సిన ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు. నిబంధనల ప్రకారం వంద గజాల స్థలంలో నిర్మిస్తే పదిశాతం స్థలం మున్సిపాల్టీకి కేటాయించాలి. భవనాలకు సెట్‌బ్యాక్ ఉండాల్సి ఉన్నా ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. పట్టణాల్లో దుకాణ సముదాయాలన్నీ సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మిస్తున్నారు. భవనానికీ భవనానికి మధ్య మీటరు నుంచి మీటరున్నర వరకు ఖాళీస్థలం వదలాల్సి ఉండగా.. ఎవరూ పాటించడం లేదు. బహుళ అంతస్తుల విషయంలోనూ జిల్లా ఏర్పడక ముందు పదిలోపు ఉంటే ఇప్పుడు 50కిపైగా ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 35 వాటికే అనుమతులు ఉన్నాయి.

తప్పుడు ధ్రువపత్రాలతో..

బహుళ అంతస్తులు, భారీ భవంతులున్న ప్రియదర్శినినగర్, ఆదర్శనగర్, శాస్త్రినగర్, శాంతినగర్, ఈద్గాం, దివ్యానగర్, విజయనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఎలాంటి నిబంధనలు కనిపించవు. భవనం చుట్టూ అగ్నిమాపక వాహనం వెళ్లడానికి వీలుగా వీటిని నిర్మించాల్సి ఉన్నా.. ఇక్కడున్న వాటిల్లో ఖాళీ స్థలం వదలలేదు. చాలా ప్రాంతాల్లో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లకు వెళ్లే రహదారులపై ఒక ట్రాక్టరు వస్తే మరో ట్రాక్టరు వెళ్లలేని పరిస్థితి. ఇలాంటి ప్రాంతాల్లో వీటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరు. కొంతమంది స్థిరాస్తి వ్యాపారులు తప్పుడు ధ్రువపత్రాలతో అనుమతులు తెచ్చుకున్నా.. స్థానిక ప్రజాప్రతినిధులు, పుర అధికారులు అడ్డుకోవాల్సి ఉన్నా ఎక్కడా ఆ దాఖలాలే లేవంటే అక్రమాలు ఏ మేరకు జరుగుతుందో ఇట్టే తెలిసిపోతుంది.

ఎక్కడెక్కడంటే..

శివాజీచౌక్ సమీపంలో రెండు బహుళ అంతస్తుల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినట్లు అధికారులు గుర్తించినా వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాలుగు అంతస్తుల వరకు అనుమతులు పొంది ఆరు అంతస్తులు వేశారు.

ప్రియదర్శినినగర్, ఈద్గాం, ఆదర్శనగర్, దివ్యనగర్, శాంతినగర్, విద్యానగర్, మంజులాపూర్, విజయనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లోనూ అనుమతులు ఒక తీరు ఉంటే నిర్మాణాలు మరో తీరుగా చేపట్టారు. రెండంతస్తుల నిర్మాణాలకు అనుమతులు తీసుకుని నాలుగైదు నిర్మించారు. నిర్మాణం కోసం అనుమతులు ఇచ్చిన తర్వాత ఆ నిర్మాణాలు జరుగుతున్న తీరును పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పర్యవేక్షించాల్సి ఉన్నా.. ఇక్కడ జరగడం లేదు.

పట్టణంలోని దివ్యనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్‌భూమిలో ఓ నేత బహుళ అంతస్తు నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం- సి.వి.ఎన్.రాజు, కమిషనర్, పురపాలక సంఘం, నిర్మల్‌పట్టణంలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చూస్తున్నాం. ఇళ్లు, భవనాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చర్యలు తీసుకుంటాం.

# తీరని సమస్యలు.. గర్భిణీలకు వెతలు



ఖమ్మం : రూ.కోట్లు వెచ్చించి భవనం నిర్మించారు. ఆధునిక పరికరాలు సమకూర్చారు. కానీ సిబ్బంది కొరవడి.. పర్యవేక్షణ లేక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రానికి (ఎంసీహెచ్) వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తామని అధికార యంత్రాంగం ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయి. కొందరు ప్రైవేటు ఆసుపత్రుల వైపు మొగ్గుచూపే పరిస్థితి నెలకొంది.

స్కానింగ్ అంటే.. ప్రైవేటుకే

రూ.30 లక్షలతో టిఫా స్కానింగ్ పరికరాన్ని కొద్దినెలల క్రితం సమకూర్చారు. రెగ్యులర్ ప్రాతిపదికన పనిచేయాల్సిన రేడియాలజిస్టు లేకపోవడం, డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న వైద్యురాలు సెలవుపై వెళ్లడంతో వారం రోజులుగా స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రికి చెందిన సదరు రేడియాలజిస్టు సేవలతో ఇంతకా లం ఎలాగోలా నెట్టుకొచ్చారు. ప్రస్తుతం ఆమె వ్యక్తిగత సమస్యలతో సెలవుపై వెళ్లారు. దీంతో స్కానింగ్ సేవలు మరుగునపడ్డాయి. అత్యవసర కేసులకు ప్రత్యామ్నాయంగా కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఓ వైద్యురాలు స్కానింగ్ సేవలు కొనసాగిస్తున్నారు. ఎంసీహెచ్‌లో సేవలు పొందే గర్భిణులు చాలా మందిని ప్రైవేటు ల్యాబ్‌లకు రిఫర్ చేయాల్సి వస్తోంది. వాస్తవానికి నలుగురు రేడియాలజిస్టులు ఇక్కడ విధులు నిర్వర్తించాల్సి ఉంది. వారి నియమాకంపై అధికారులు దృష్టి పెట్టడం లేదు.

వెంటిలేటర్ల వినియోగం ఏదీ?

ప్రసవ సమయాల్లో గర్భిణులకు సంక్లిష్ట పరిస్థితుల్లో వెంటిలేటర్లు వినియోగించాల్సి ఉంటుంది. ఎంసీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఆరు వెంటిలేటర్లను ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు. పరికరాలను పూర్తిస్థాయిలో సమకూర్చలేదు. మత్తు వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నా వెంటిలేటర్లను సద్వినియోగం చేసుకోవడంలో జాప్యం జరుగుతోంది. ఎవరికైనా అత్యవసరమైతే అప్పటికప్పుడు జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలిస్తున్నారు.

స్టాఫ్‌నర్సుల కొరత ఆసుపత్రిలో సిబ్బంది కొరత సమస్య నెలకొంది. 19 మందికి గాను కేవలం 11 మంది స్టాఫ్‌నర్సులు మాత్రమే ఉండగా.. వారు ఎస్ఎన్‌సీయూ సేవలకే పరిమితం అవుతున్నారు. ఇతర అత్యవసర (ఏఎన్‌సీ) వార్డుల్లో సేవలందించేందుకు, లేబర్ గదిలో వైద్య సహాయం అందించేందుకు స్టాఫ్‌నర్సుల సంఖ్య మరింత పెంచాల్సి ఉంది.ఒకే ఒక అంబులెన్స్..రామవరం ఎంసీహెచ్‌లో ప్రత్యేక రక్తనిధి (బ్లడ్‌బ్యాంకు) ఇంకా ఏర్పాటు చేయలేదు. ఔషధాలకు ప్రత్యేక స్టోరేజీ వ్యవస్థ అందుబాటులో రాలేదు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎక్కించాల్సి వస్తే జిల్లా సర్వజన ఆసుపత్రికి పరుగులు తీయాల్సి వస్తోంది. మందులను తీసుకురావాలన్నా అక్కడికే తరలాల్సిన పరిస్థితి. రక్తనిధి, ఔషధాల స్టోరేజీ విభాగాల నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బంది అవసరం. కేవలం ఒక అంబులెన్స్ మాత్రమే అందుబాటులో ఉంది. ఎంసీహెచ్‌కు అవసరమైన రక్తం యూనిట్లు, ఔషధాలను దీంట్లోనే సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా జిల్లా సర్వజన ఆసుపత్రి నుంచి రిఫర్ చేసే రోగులకు సరైన అంబులెన్స్ సదుపాయం అందుబాటులో ఉండటం లేదు. ఖమ్మం ఎంసీహెచ్‌లో..రామవరం ఎంసీహెచ్‌తో ఖమ్మంలోని ఆసుపత్రిని పోల్చిచూస్తే ఇంకెన్నో సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. అక్కడి ఆసుపత్రిలో రోజు ఓపీ 500 వరకు నమోదవుతోంది. రెగ్యులర్ రేడియాలజిస్టు అందుబాటులో ఉన్నారు. రోజుకు సుమారు 80 మందికి స్కానింగ్‌లు చేస్తున్నారు. 30 వెంటిలేటర్లు ఉండగా, అవసరమైతే అన్ని వినియోగించేలా నిర్వహణ ఉన్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రత్యేక బ్లడ్‌బ్యాంక్‌లో 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. రోజుకు రెండు షిఫ్టులలో ఇద్దరు చొప్పున సిబ్బంది ఔషధాల సరఫరా, స్టోరేజీ పనుల్లో నిమగ్నమవుతున్నారు. గర్భిణులను ఎంసీహెచ్‌కు గర్భిణులను తీసుకొచ్చేందుకు ఖమ్మం జిల్లాలో 108లు 22 అందుబాటులో ఉండగా.. రెగ్యులర్ పరీక్షలు, ఇతర సేవలకు '102' వాహనాలు 23 నడుపుతున్నారు. మన్యం జిల్లా భద్రాద్రిలోనూ ఆయా వాహనాలు 60కి పైగా ఉన్నాయి. వీటి సేవలను ఎంసీహెచ్‌కు వచ్చే గర్భిణులు, బాలింతలకు అందుబాటులో ఉండేలా సమన్వయపరచాలనే డిమాండ్ వినిపిస్తోంది.ఎంసీహెచ్‌లో రేడియాలజిస్టుల నియామకానికి ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం ఇబ్బందులు లేకుండా ఇద్దరు వైద్యులు సేవలందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో టిఫా స్కానింగ్ సేవలు అందేలా చూస్తున్నాం.

# రాగి జావ.. బాల్యానికి భరోసా

వేములవాడ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంపూర్ణ పోషణకు సర్కారు అనేక చర్యలు తీసుకుంటోంది. వారికి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు పీఎం పోషణ్ కార్యక్రమంలో భాగంగా రాగిజావ అందిస్తోంది. జూన్ 20న విద్యా దినోత్సవం సందర్భంగా రాగిజావ పంపిణీ చేయాలని ప్రభుత్వం భావించినా కొన్ని పాఠశాలల్లో మాత్రమే అమలు చేశారు. ఈ నెల నుంచి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం రాగిజావ అందజేస్తున్నారు.సర్కారు బడుల్లో పేద కుటుంబాల విద్యార్థులు చదువుతున్నారు. పోషకాహార లోపంతో తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తూ విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్న ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి 1-10 తరగతుల విద్యార్థులకు రాగిజావ అందించి పోషకాహార లోపాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటోంది. ఈ పథకం



అమలుతో జిల్లాలోని 1,483 సర్కారు బడుల్లో చదువుతున్న 88,806 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

శక్తినిచ్చే ఆహారం.. పేద పిల్లలే సర్కారు బడుల్లో ఉండటంతో వారిలో చాలామంది ఉదయం వేళ అల్పాహారం తీసుకోకుండా వస్తుంటారు. అలాంటి వారికి మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టింది. ఐరన్, విటమిన్ లోపాలు తలెత్తకుండా ఈ రాగి జావలో ఎన్నో పోషక గుణాలు ఉన్నాయి. రాగి జావ తయారీకి అవసరమైన ముడి సరకులను శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ భాగస్వామ్యంతో ప్రభుత్వం సరఫరా చేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్యాక్ చేసిన ఫోర్టిఫైడ్ రాగి పొడి, బెల్లం పొడి అందించారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి, 10 గ్రాముల బెల్లం పొడి వంతున మండల మానవ వనరుల కేంద్రాలకు చేరుకోగా పాఠశాలల వారీగా పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ కార్మికులకే రాగిజావ తయారీ బాధ్యతను అప్పగించారు. వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉడికించిన కోడిగుడ్డు అందిస్తున్నారు. మిగతా మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో అల్పాహారంగా రాగిజావ అందిస్తున్నారు. వారంలో మూడు రోజులు అందిస్తున్నాం: బాలాజీ, ఎంఈవో, అడవిదేవులపల్లిసర్కారు బడుల్లో చదివే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం వారంలో మూడు రోజుల పాటు రాగిజావ పంపిణీ చేస్తోంది. దీంతో విద్యార్థుల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుంది. తద్వారా చదువులో రాణించడంతోపాటు ఉత్సాహంగా ఉంటారు.

# తీరనున్న అద్దె పంచాయితీ..!

కోదాడ : గ్రామాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తండాలను, చిన్న గ్రామాలను జీపీలుగా మార్చింది. అందులో భాగంగా పరిపాలనకు కేంద్రాలుగా చెప్పుకొనే గ్రామపంచాయతీ కార్యాలయాలు నిర్మించాలనే ఉద్దేశంతో పాటు, శిథిలావస్థకు చేరిన జీపీ కార్యాలయాల స్థానంలో నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. గ్రామానికి సంబంధించిన ముఖ్యమైన పత్రాలు భద్రపరిచేందుకు, సమావేశాలు నిర్వహించేందుకు వీటి అవసరం ఉంటుంది. నూతన నిర్మాణ పనులు పూర్తయితే సొంత భవనాల్లో పరిపాలన కొనసాగుతుంది.

రూ.20 కోట్లతో నిర్మాణాలు: జిల్లాలో కొత్తగా ఏర్పడిన 174 జీపీలతో కలిపి మొత్తం 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన వాటితో పాటు, కొన్ని నూతన జీపీలకు భవనాలు నిర్మించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా ఒక్కో జీపీకి రూ.20 లక్షల చొప్పున రూ.20.4 కోట్ల వ్యయంతో 102 భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. అధికారులు 87 జీపీలకు స్థలాలు గుర్తించి నిర్మాణాలు ప్రారంభించారు. మరో 15 జీపీలకు స్థలాలను గుర్తించే పనిలో ఉన్నారు. ఇప్పటి వరకు 10 భవనాల పనులు పూర్తికాగా, మరో 40 చివరి దశ పనుల్లో ఉన్నాయి. మిగిలిన వాటిలో 60శాతం పనులు పూర్తయ్యాయి.



వందకు పైగా శిథిలావస్థలో..:

ఎప్పుడో నిర్మించిన పాత భవనాలు వర్షాలు వస్తే కూలిపోయే స్థితిలో ఉన్నాయి. భారీ వర్షాలకు కార్యాలయాలు కురవడంతో గోడ పెచ్చులు ఊడి ప్రమాదాలు జరిగిన సందర్భాలు అనేకం. మౌలిక వసతులులేక పరిపాలనకు తీవ్ర అంతరాయాలు ఏర్పడేవి. జిల్లాలో మండలానికి కనీసం నాలుగు, అయిదు జీపీల్లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. అధికారుల లెక్కల ప్రకారం వందకు పైగా భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించారు. వీటిలో అధిక సమస్యలు ఉన్న వాటి నిర్మాణాలకు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందించారు. త్వరగా నిర్మాణాలు చేపట్టి, పరిపాలన కుంటుపడకుండా చూడాలని ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. వీటికి తోడు ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయడంతో ఇప్పటికీ అద్దె భవనాల్లోనే పరిపాలన సాగిస్తున్నారు. దీంతో ప్రతినెలా అద్దె చెల్లించడం అదనపు భారంగా మారింది.

మెరుగైన పాలనకు అనువుగా ఉంటుంది

శోభారాణి, అళ్వాలపురం సర్పంచి, కోదాడ

అయిదేళ్ల క్రితం మా గ్రామం జీపీగా మారింది. అప్పటి నుంచి ప్రతి నెలా రూ.3 వేలు అద్దె చెల్లించి పరిపాలన సాగిస్తున్నాం. ముఖ్యమైన పత్రాలు భద్రపరచాలంటే ఇబ్బందులే ఇబ్బందులు తప్పడం లేదు. ఇరుకు గదుల్లో పాలన నిర్వహించాలంటే కష్టంగా ఉంది. కొత్త భవనం అందుబాటులోకి వస్తే మెరుగైన పరిపాలనకు అనువుగా ఉంటుంది. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి.

త్వరలోనే అందుబాటులోకియాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి జిల్లాలో 102 జీపీ భవన నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. దాదాపు అన్ని నిర్మాణాల్లో 80శాతం పనులు పూర్తయ్యాయి. మరో 15 జీపీలకు స్థలాలను పరిశీలించాల్సి ఉంది. త్వరలోనే నూతన భవనాలను అందుబాటులోకి తీసుకొస్తాం.

# పేరుకే జిల్లా ఆసుపత్రి!

ములుగు : ములుగు జిల్లా ఆసుపత్రిని నిధుల కొరత వెంటాడుతోంది. రోజు రోజుకు రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ నిధుల కొరతతో ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. జిల్లా ఆసుపత్రిగా ఉన్నతీకరించినప్పటికీ ప్రభుత్వం ఇంకా సామాజిక ఆరోగ్య కేంద్రంగానే భావిస్తోంది. అదే తరహాలో నిధులు కేటాయిస్తోంది.

నిర్వహణ భారం ఆసుపత్రికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రోజుకు సుమారు 500 మంది రోగులు వస్తుంటారు. అలాంటి వారికి నిధుల కొరతతో కనీస వసతుల కల్పన కష్టంగా మారుతోంది. ఆసుపత్రిలో ఎలాంటి లోటు ఉండకూడదనే ఉద్దేశంలో జిల్లా కలెక్టర్ కృష్ణఆదిత్య పూర్తి స్థాయిలో సహకరిస్తుండడంతో మనుగడ సాగుతోంది. జిల్లా ప్రజలకు ఆసుపత్రి పెద్దదిక్కుగా మారడంతో రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏటూరునాగారం, వెంకటాపురం లాంటి సామాజిక ఆరోగ్య కేంద్రాల నుంచి సిఫారసు చేసిన వారు కూడా వస్తుంటారు. ప్రభుత్వం నుంచి అనుమతి లేకున్నా ఆసుపత్రిలో ఐసీయూ కేంద్రాన్ని అధునాతన యంత్రాలతో నడిపిస్తున్నారు. 100 పడకలు, సీటీ స్కాన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, డిజిటల్ ఎక్స్‌రే, సుమారు 50 రకాల పైగా రక్త పరీక్షలు నిర్వహించే టీ హబ్, కాన్పులతో పాటు, వివిధ రకాల సర్జరీలు చేయడం లాంటి వసతులు అందుబాటులో ఉండడంతో ప్రజలు వైద్యం కోసం



ఎంతో ఆశతో వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రి నిర్వహణ బాధ్యత మరింత భారంగా మారుతోంది. ప్రభుత్వం స్పందించి జిల్లా ఆసుపత్రి స్థాయిలో నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏడాదికి బడ్జెట్ రూ. 2.50 లక్షలే..

జిల్లా ఆసుపత్రిని ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రంగా పరిగణిస్తూ ఏడాదికి ఒకసారి రూ. 2.50 లక్షలు మాత్రమే బడ్జెట్ కేటాయిస్తోంది. దీంతో సామాజిక ఆరోగ్య కేంద్రమా, ఏరియా ఆసుపత్రా, జిల్లా ఆసుపత్రా అనే సందేహాలు జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. కనీసం ఏరియా ఆసుపత్రిగానైనా పరిగణించి నిధులు కేటాయిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా నిధుల కేటాయింపు జరుగుతోంది. ఈ నిధులతో కనీస అవసరాలు, పరికరాల కొనుగోలు, ఆసుపత్రి మరమ్మతులు, రోగుల సంఖ్యను బట్టి వసతుల కల్పన, స్టేషనరీ కొనుగోలు, ఫ్యాన్లు, ట్యూబులు, మోటార్ల మరమ్మతులు, కొనుగోళ్లు చేసుకోవడానికి ఈ నిధులను ఉపయోగిస్తారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులు ఒకటి లేదా రెండు నెలలకు మాత్రమే సరిపోతోంది. మిగిలిన ఏడాదంతా వచ్చే సంవత్సరం బడ్జెట్ కోసం ఎదురు చూపులతోనే గడిచిపోతోంది.

# కరాటే శిక్షణ.. బాలికలకు ఆత్మరక్షణ

గంభీరావుపేట : ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా బాలికలు, మహిళలపై దాడులు కొనసాగుతున్నాయి. బాలికల స్వీయ రక్షణ కోసం ప్రభుత్వం కరాటే శిక్షణ ఇవ్వడానికి చర్యలు చేపట్టింది. గతంలో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వగా కరోనా సమయంలో దీనిని నిలిపివేశారు. ప్రస్తుతం ఈ నెల 4 నుంచి జిల్లా వ్యాప్తంగా బాలికలు అధికంగా ఉన్న పాఠశాలను గుర్తించి శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో కస్తూర్బా, ప్రభుత్వ పాఠశాలలు కలిపి 100 ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో శనివారం నుంచి శిక్షణ ప్రారంభించగా నెల రోజుల పాటు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. 33 మంది శిక్షకులను ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ. 5 వేల వేతనం చెల్లించనున్నారు.

పెరగనున్న ఆత్మవిశ్వాసం

ప్రధానంగా బాలికలపై జరుగుతున్న అకృత్యాలు సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయి. ఇటువంటి తరుణంలో బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు, విపత్కర పరిస్థితుల్లో రక్షించుకోవడానికి కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. అన్ని జిల్లాల్లో గత నెలలో ప్రారంభించినప్పటికీ రాజన్న సిరిసిల్ల జిల్లాలో కరాటే శిక్షకులపై ప్రత్యేక దృష్టిపెట్టారు. గతంలో శిక్షణ ఇచ్చిన సీనియర్లతోపాటు మరికొం



దరిని తీసుకున్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం విద్యార్థినులకు ఉపయోగకరంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఎంతో ఉపయోగంకరాటే శిక్షణ తీసుకోవటం వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుంది. కేవలం నెల రోజుల పాటు కాకుండా ప్రతి విద్యా సంవత్సరం మూడు నెలల పాటు ఇస్తే అందులోని మెలకువలను పూర్తిగా తెలుసుకోవచ్చు. ప్రతి విద్యా సంవత్సరం అందించే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

భవనిత వర్ధిని, ఎనిమిదో తరగతి

పకడ్బందీగా నిర్వహణజిల్లాలో కరాటే శిక్షణను పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుంది. నెల రోజుల పాటు శిక్షణ అందిస్తున్నారు. పురుషులతో పాటు స్త్రీలు సమానంగా ఉండాలనే ఉద్దేశంతో కరాటే శిక్షణను అందిస్తున్నాం. విద్యార్థి దశ నుంచి ఆత్మరక్షణ శక్తిని పెంపొందించేలా మార్పు తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. కరాటే శిక్షణ ఇవ్వటం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినుల సంఖ్య పెరుగుతుంది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికలకు ఇస్తున్నారు. పద్మజ, జెండర్ అండ్ ఈక్విటీ జిల్లా సమన్వయకర్త

# సౌర కాంతులు



ఖమ్మం : స్వయం సహాయక సంఘాల సభ్యులకు సౌర విద్యుత్తు యూనిట్లను అందించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. టీఎస్ రెడ్‌కోతో ఈ మేరకు ఒప్పందం చేసుకుంది. 200 నుంచి 300 యూనిట్ల వరకు విద్యుత్తును గృహ అవసరాలకు వినియోగించే సంఘం సభ్యులకు, ఎన్‌పీఏ తక్కువ ఉంటే దీనికి ఎంపిక చేస్తారు. వీరి ఇళ్లలో సౌర విద్యుత్తు యూనిట్లను ఏర్పాటు చేసుకునేలా చైతన్యం చేయనున్నారు. కసరత్తు ప్రారంభం స్త్రీనిధి నుంచి రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సభ్యులు 60 నెలల్లో నెలవారీ వాయిదాల పద్ధతిలో చెల్లించాలి. 11 శాతం వడ్డీ కలిపి కట్టాలి. దీనిపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి విద్యాచందనతో టీఎస్ రెడ్‌కో డీఎం ఉమాకాంత్, స్త్రీనిధి ఆర్‌ఎం రవీంద్రనాయక్ ఇటీవల చర్చించారు. యూనిట్ల ఏర్పాటు, సబ్సిడీ, దరఖాస్తులు, సభ్యుల వాటాధనం తదితర వివరాలపై చర్చించారు. ఇప్పటికే ఎంపిక చేసిన మండలాల్లో సభ్యులను గుర్తించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1200 మంది సభ్యులు సౌర విద్యుత్తు యూనిట్ల మంజూరుకు అర్హత కలిగి ఉన్నారు. వారిలో మొదటి విడత 385 యూనిట్లకు ఎంపిక చేయనున్నారు.

పథకానికి ఎంపికైన మండలాలు

చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ, సత్తుపల్లి గ్రామీణం, ఖమ్మం గ్రామీణం, కొణిజర్ల మండలాలతో పాటు మెప్మాలో సత్తుపల్లి ప్రియదర్శిని, మధిర సరస్వతి, ఖమ్మంలోని కస్తూరి సంఘాలను ఎంపిక చేశారు.

భద్రాచలం, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, ఆళ్లపల్లి, దుమ్ముగూడెం, గుండాల, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, పినపాక మండలాలను ఎంపిక చేశారు.

ఒక్కో మండలంలో 35 యూనిట్లను మంజూరు చేయనున్నారు. మెప్మాలోనూ 35 మంది సభ్యులను ఎంపిక చేయనున్నారు.

ఉత్పత్తి ఇలా..టీఎస్ రెడ్కో సహకారంతో గృహాలపై ఫైనాన్సింగ్ గ్రిడ్ కనెక్టెడ్ రూఫ్ టాప్ సోలార్ యూనిట్లను ఏర్పాటు చేస్తారు. ప్రతి ఇంటికీ 2 నుంచి 3 కిలోవాట్ల పవర్ యూనిట్లను ఏర్పాటు చేసుకుంటే ప్రతిరోజు 2 నుంచి 12 యూనిట్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. సోలార్ విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీపై అందించే పరికరాలకు 25 ఏళ్లపాటు గ్యారెంటీ ఉంటుంది. ఉత్పత్తి చేసిన విద్యుత్తును గృహ వినియోగానికి ఖర్చు చేయగా మిగిలింది గ్రిడ్‌కు విక్రయించవచ్చు. అందుకు యూనిట్‌కు రూ. 4.20 ఇస్తారు.

సోలార్ విద్యుత్తు యూనిట్ల ఏర్పాటు సభ్యులకు ఎంతో ఉపయోగపడుతుంది. అందుకోసం వారికి అవగాహన కల్పిస్తాం. ఎంపిక చేసిన మండలాల్లో సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఎం. విద్యాచందన, డీఆర్డీవో

# వివాదాల నిలయం.. ఆ కార్యాలయం




ఖమ్మం: పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాల్సిన మండల పరిషత్ అధికారులు, కార్యదర్శుల మధ్య సమన్వయం కొరవడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పినపాక మండలంలో నిత్యం ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తున్నారు. గ్రూపులుగా ఏర్పడి కార్యాలయాన్ని వివాదాలకు నిలయంగా మార్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒకరిపై ఒకరు..పంచాయతీల్లో విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపిస్తూ ఎంపీవో ఇటీవల పలువురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యానికి సంబంధించిన చిత్రాలను సైతం బహిర్గతం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాను పంచాయతీల్లో పర్యటించి విధులు సక్రమంగా నిర్వహించని వారిపై చర్యలకు సిద్ధపడినట్లు పేర్కొన్నారు. ఎంపీవో తమను కావాలనే ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. సమయం సందర్భంగా లేకుండా సమావేశానికి హాజరు కావాలంటూ మహిళా కార్యదర్శులను సైతం ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఎంపీడీవో, ఎంపీవోపై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఇటీవల తీర్మానం చేశారు. తనకు సంబంధం లేకుండా తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్న ఎంపీడీవో.. కార్యాలయంలో విధుల పట్ల కార్యదర్శులు, ఎంపీవో, సీనియర్ సహాయకుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రత్యారోపణ చేశారు. సమాచారం లేకుండా విధులకు గైర్హాజరవుతున్న సీనియర్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డిని విధుల నుంచి తొలగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ శ్రద్ధ.. విధుల్లో లేకపాయేకార్యాలయంలో పైనుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు సమన్వయం లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి పనిలో వివాదాన్ని వెతికే బదులు విధులపై శ్రద్ధ పెడితే నూరు శాతం అర్హులకు న్యాయం జరుగుతుందనటంలో సందేహం లేదు. గతంలో నూతన పింఛన్ల వ్యవహారంలో అనర్హులకే పెద్దపీట వేసిన యంత్రాంగం నూతన సర్క్యులర్ ద్వారా అర్హులైన వృద్ధుల దరఖాస్తులు తీసుకోవాలని సూచించినప్పటికి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వృద్ధ జంటలో ఎవరో ఒకరు మరణిస్తే.. వేరొకరికి పింఛను రావడం లేదని, తమ దరఖాస్తు స్థితి పరిశీలించాలని వేడుకునేందుకు రోజుకు పదుల సంఖ్యలో కార్యాలయానికి వస్తున్నా వారి గోస వినే నాథుడే కరవయ్యాడు.

ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదులు

ఎంపీడీవో కార్యాలయంలో వివాదాల తతంగం ఉన్నతాధికారుల దృష్టికి సైతం చేరింది. ఎవరివారు ప్రత్యేకంగా వారి సమస్యలను అధికారుల వద్దకు తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలను డీపీవోకు నివేదిక రూపంలో అందజేశారు. ఏదిఏమైనా ఉన్నతాధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. ఎంపీడీవో, ఎంపీవోపై కార్యదర్శులు జిల్లా పాలనాధికారి అనుదీప్‌కు వినతి అందజేసినట్లు తెలిసింది. సీనియర్ సలహాదారు, కార్యాలయ సిబ్బంది వివాదాలకు సంబంధించి సైతం కలెక్టరు దృష్టి సారించారు. వారి ఆదేశాల మేరకు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. విద్యాలత, జడ్పీ సీఈవో"కార్యాలయంలో జరుగుతున్న వివాదాలకు సంబంధించి పలువురు కార్యదర్శులు వినతి అందజేశారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం. బాధ్యతలు విస్మరిస్తే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం."లక్ష్మీరమాకాంత్, డీపీవో

# ఎవరి ప్రయత్నాలు వారివే..

ఖమ్మం: వైరా నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు పదునెక్కుతున్నాయి. పొంగులేటి వర్గంలో బాణోత్ విజయాబాయి చేరిక అనంతరం వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పొంగులేటి సమక్షంలో చేరికలకు హాజరైన పార్టీ ముఖ్య నాయకులందరినీ ఇప్పటికే బహిష్కరించిన భారాస, అనంతర కార్యకలాపాలపై దృష్టి సారించింది. నియోజకవర్గ స్థాయి సమావేశం వేదికగా ప్రత్యర్థి వర్గం దూకుడుకు బ్రేకులు వేయాలనే ఉద్దేశంతో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. నిశిత దృష్టితో...వైరా పరిణామాలు ప్రధాన నాయకుల దాకా వెళ్లడంతో స్థానిక పరిస్థితులను చక్కదిద్దేందుకు భారాస జిల్లా నాయకత్వం ప్రయత్నిస్తోంది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే రాములునాయక్ ఆధ్వర్యంలో మంగళవారం వైరాలో భారాస నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఐదు మండలాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులకు సమాచారం అందించారు. ఈ సమావేశం వేదికగా.. అధికార పార్టీని కాదని చేసేదేమీ ఉండదనే ధీమాను, దూకుడుగా వెళ్తే పదవులతో పాటు ప్రాబల్యం కోల్పోవాల్సి వస్తుందంటూ హెచ్చరికలు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు మూడు నాలుగు రోజుల్లో నియోజకవర్గ కేంద్రంలో పొంగులేటి వర్గం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీలైనంత మంది ముఖ్య నాయకులను తమ వెంట తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. సందిగ్ధంలో ఉండే ముఖ్యులకు పొంగులేటి స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. దీంతో రెండు సమావేశాలూ ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

పదవులకు ఎసరు ఇప్పటికే పార్టీలోని పలువురు ముఖ్యులను, నామినేటెడ్ పదవులు ఉన్న వారిని భారాస నుంచి బహిష్కరించారు. వీరిలో రైతుబంధు కన్వీనర్లు, మండల కమిటీ పదవులు పొందినవారు, ఆలయ కమిటీ ఛైర్మన్లు, ఏఎంసీ డైరెక్టర్లు, ఆత్మ ఛైర్మన్ వంటి పదవులున్నాయి. కొత్త వారికి పదవులిచ్చే అంశాన్ని ఎమ్మెల్యేతో పాటు ముఖ్య వర్గీయులు సమాలోచనలు జరుపుతున్నారు. దీంతో బహిష్కృతుల పదవులు పోవడం ఖాయంగా కనిపిస్తుంది. మరోవైపు పురపాలక వ్యవహారం సైతం కీలక మలుపు తిరగనుంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో మున్సిపాలిటీలో ప్రస్తుత పరిస్థితులు, కౌన్సిలర్ల మనోగతం వంటి అంశాలను రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజశ్వర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యేతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు ద్వారా తెలుసుకున్నట్లు సమాచారం.

# నిండా నీరు.. ముందుకు కదలని తీరు

ముస్తాబాద్ : ఏళ్ల తరబడి ఎగువ మానేరు జలాశయం కాల్వలో పేరుకుపోయిన తుంగ, పిచ్చి మొక్కలు తొలగించడం లేదు. అక్కడక్కడ ఉపాధి కూలీల ద్వారా పూడిక తొలగిస్తూ నామ మాత్రపు చర్యలు చేపడుతున్నారే తప్పా పూర్తిస్థాయిలో పనులు చేపట్టిన దాఖలాలు లేవు. నిధుల మంజూరు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా వాటికి మోక్షం కలగడం లేదు. ఎగువ మానేరులో జలకళ సంతరించుకొన్నప్పటికీ చివరి ఆయకట్టు వరకు నీరందని పరిస్థితి ఉంది. కాల్వలు, తూంల మరమ్మతులు చేపట్టాలని వేడుకొంటున్నా ఫలితం ఉండటం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంభీరావుపేట మండలం నర్మాలలో ఎగువ మానేరు జలాశయం ఉంది. దీని సామర్థ్యం 31 అడుగులు కాగా, ప్రస్తుతం 26 అడుగుల వరకు నీరు ఉంది. యాసంగి సాగు కోసం మూడు మండలాల్లోని ఆయకట్టుకు డిసెంబరు 16న ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు కలిసి నీటిని విడుదల చేశారు. కుడి కాల్వ ద్వారా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మూడు మండలాల్లోని నర్మాల, కోళ్లమద్ది, కొత్తపల్లి, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, బండలింగంపల్లి, గోపాల్‌పల్లె, రాంరెడ్డిపల్లె, కొండాపూర్, గూడెం, గూడూరు, నామాపూర్, ముస్తాబాద్, పోత్గల్, తెర్లుమద్ది గ్రామాల ఆయకట్టుకు సాగునీరందుతుంది. మూడు మండలాల్లో కలిపి 13 వేలకు పైగా ఆయకట్టు ఉండగా, అత్యధికంగా ముస్తాబాద్ మండలంలోనే 8,556 ఎకరాల ఆయకట్టు ఉంది. ఎగువమానేరు నుంచి తెర్లుమద్ది చివరి ఆయకట్టు వరకు 22 డిస్ట్రిబ్యూటర్‌లు ఉండగా, చిన్న చిన్న డిస్ట్రిబ్యూటర్లు దాదాపు



40 వరకు ఉన్నాయి. కాల్వల ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. కాల్వలు, తూంలు, షట్టర్లు చెడిపోయి ఏళ్లు కావస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఎగువ మానేరు కాల్వలో అక్కడక్కడ ఉపాధి హామీ కూలీల ద్వారా పూడిక, పిచ్చి మొక్కలను తొలగించినప్పటికీ మరికొన్ని చోట్ల బాగా పెరిగిపోయాయి. నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగు నీరు సాఫీగా పారేందుకు కాల్వలు, తూంల మరమ్మతులు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

మాది తెర్లుమద్ది గ్రామం. ఎగువ మానేరు కాల్వ నీటిపై ఆధారపడి రెండెకరాల పొలం సాగవుతుంది. యాసంగి సాగు కోసం ఎగువమానేరు కాల్వ ద్వారా నీరు వదలారు. సంతోషంగా ఉంది. మండల కేంద్రంలోని మురుగు వచ్చి ఎగువ మానేరు కాల్వలో చేరుతుంది. దీంతో చెత్తచెదారం ఇందులో చేరి నీరు కలుషితమతుంది. కాల్వలో అక్కడక్కడ తుంగ, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి కొంత ఇబ్బంది తలెత్తుతుంది. ఏళ్ల తరబడి కాల్వలు, తూంలు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేసి పంట చేతికొచ్చే వరకు సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. పుట్ట అశోక్, రైతు, తెర్లుమద్ది

ప్రతిపాదనలు పంపించాం

ఎగువ మానేరు కుడి కాల్వ నుంచి తెర్లుమద్ది 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఏడాది క్రితమే కాల్వలు, తూంలు, షట్టర్ల మరమ్మతుల కోసం రూ. 50 కోట్లకు ప్రతిపాదనలు పంపించాం. మరో రూ. 10 కోట్లకు ప్రతిపాదనలు పంపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే కాల్వలు, తూంలు, షట్టర్లు, ప్రధాన రోడ్డు వెంట ఉన్న ఎగువ మానేరు కాల్వ వంతెనల వద్ద తూంల మరమ్మతులు చేపడతాం. ఉపాధి కూలీల ద్వారా కాల్వలో పెరిగిన తుంగ, పిచ్చి మొక్కలను అక్కడక్కడ తొలగించారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తున్నాం. రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలు తలెత్తకుండా చూసుకుంటున్నాం. వంశీకృష్ణ, ఏఈ, జలవనరులశాఖ

# ఆరోగ్య ఉప కేంద్రాలకు మహర్దశ

మెట్‌పల్లి : నియోజకవర్గంలోని ఆరోగ్య కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. పలు కేంద్రాలకు సొంత భవనాలు సమకూరనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు సొంత భవనాలు లేక పంచాయతీ కార్యాలయాలు, అద్దె గదుల్లో అసౌకర్యాల మధ్య సేవలు అందిస్తుండగా కొన్ని సొంత భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వైద్యసేవలు అందించడంలో సిబ్బంది, సేవలు పొందడంలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెలలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కోరుట్ల నియోజకవర్గంలో పర్యటించగా ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు నియోజకవర్గంలోని ఆరోగ్య కేంద్రాల పరిస్థితిని వివరించారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. హామీ ఇచ్చిన మంత్రి శుక్రవారం కోరుట్ల నియోజకవర్గంలోని 36 ఆరోగ్య కేంద్రాల సొంత భవనాల నిర్మాణానికి రూ. 7.20 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు సమకూరడం వల్ల గ్రామాలు, పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ భవనంలోనే..ఇది మెట్పల్లి మండలం జగ్గాసాగర్‌లోని ఆరోగ్య ఉప కేంద్రం. ఇక్కడ సొంత భవనం లేక గ్రామ పంచాయతీలోని ఓ చిన్న గదిలో ఏర్పాటు చేశారు. పంచాయతీలో నిర్వహిస్తుండడంతో అవసరాల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి వచ్చే వారు, వైద్యం కోసం వచ్చే వారు అసౌకర్యానికి గురవుతున్నారు. నూతన భవన నిర్మాణంతో ఇబ్బందులు తొలగనున్నాయి.

మండలాల వారీగా మంజూరైన నూతన భవనాలు

మెట్పల్లి పట్టణం: రేగుంట, ముస్లింపుర, ఇంద్రానగర్, దుబ్బవాడ, అంబేడ్కర్‌నగర్

మెట్పల్లి మండలం: వేంపేట, మెట్లచిట్టాపూర్, కొండ్రికర్ల, వెల్లుల్ల, జగ్గాసాగర్, మేడిపల్లి

కోరుట్ల మండలం: మాదాపూర్, జోగిన్‌పల్లి, చిన్నమెట్పల్లి, అయిలాపూర్ -1, అయిలాపూర్ -2, యూసుఫ్‌నగర్, మోహన్‌రావుపేట, కోరుట్ల పట్టణంలో మూడు భవనాలు

మల్లాపూర్: వేంపల్లి, మల్లాపూర్, రాఘవపేట, సాతారం, కొత్తదాంరాజ్‌పల్లి, మొగిలిపేట, చిట్టాపూర్, సిర్పూర్

ఇబ్రాహీంపట్నం: గోదూర్, వర్షకొండ, ఎర్దండి, తిమ్మాపూర్, డబ్బా, ఇబ్రహీంపట్నం-1, ఇబ్రహీంపట్నం-2

# హవ్వ.. ఇదేం పని జగన్.. ట్విటర్‌లో పరువు తీసేసిన పురందేశ్వరి !




అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల నూతన మండలి నియామకంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీటీడీ బోర్డు నూతన సభ్యుల నియామకంపై తాజాగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పెదవి విరిచారు. టీటీడీ బోర్డును ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని ఆమె ట్వీట్ చేశారు. శరత్ చంద్రారెడ్డి ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో పాత్రధారుడుగా ఉంటే, కేతన్ దేశాయ్ ఎంసీఐ స్కామ్‌లో దోషిగా నిలిచిన వ్యక్తి అని ఆమె ట్వీట్‌లో పేర్కొన్నారు. కేతన్ దేశాయ్‌ను ఢిల్లీ హైకోర్టు ఎంసీఐ నుంచి తొలగించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. తిరుమల తిరుపతి పవిత్రతను మసకబార్చే ఈ నియామకాలను భారతీయ జనతా పార్టీ ఖండిస్తోందని ట్విటర్‌లో పురందేశ్వరి స్పష్టం చేశారు. మొత్తం 24 మంది సభ్యుల్లో ఏడుగురికి టీటీడీ బోర్డులో మళ్లీ అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. టీటీడీ ఛైర్మన్‌గా భూమన కరుణాకర రెడ్డి ఈనెల 10వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత 15 రోజులకు పాలకమండలి సభ్యులను ప్రభుత్వం ఖరారు చేసింది. అందరూ ఊహించినట్లుగానే... తనకు ఎన్నాళ్లుగానో వివిధ కోణాల్లో ఉపయోగపడుతున్న, ఉపయోగపడతారని భావించే వాళ్లకే పెద్దపీట వేశారు. రాజకీయ ప్రాబల్యం ఉన్నవారి సిఫారసులకు, న్యాయవాదులకు అవకాశం కల్పించారు. 'ఎవరేమనుకుంటే నాకేం' అన్నట్లుగా.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడు, తర్వాత అప్రూవర్‌గా మారిన పెనక శరత్‌చంద్రా రెడ్డికి టీటీడీ బోర్డులో చోటు కల్పించారు. ఆయన.. వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అల్లుడికి సోదరుడు కావడం గమనార్హం. తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్‌కు చెందిన వారికి బోర్డులో చోటు కల్పించారు. ముఖ్యంగా తమిళనాడు నుంచి నలుగురికి ఈ జాబితాలో చోటు దక్కింది. బీజేపీకి చెందిన డాక్టర్ శంకర్‌కు బోర్డులో స్థానం కల్పించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈయన సన్నిహితుడని ప్రచారం జరుగుతోంది. వైసీపీ వచ్చాక ఇతనికి వరుసగా రెండోసారి అవకాశం దక్కింది అలాగే... హైకోర్టు న్యాయవాది కృష్ణమూర్తి వైద్యనాథన్‌కు చోటు కల్పించారు. న్యాయ వర్గాల్లో ఆయనకు మంచి పట్టుందని సమాచారం. అంతేకాదు... కృష్ణమూర్తి కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాకు సన్నిహితుడు. ఆయనకు టీటీడీ బోర్డు సభ్యుడిగా పదవి దక్కడం ఇది వరుసగా నాలుగోసారి. 'టీసీఎస్' వేణు కుమారుడు సుదర్శన్ వేణుకు కూడా పదవి లభించింది. ఇక.. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు బాగా సన్నిహితుడైన బాలసుబ్రమణియన్ పళనిస్వామికి కూడా టీటీడీ బోర్డులో చోటు కల్పించారు. మహారాష్ట్రలో శివసేన పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే కార్యదర్శి మిలింద్ నర్వేకర్‌ను కూడా టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారు. ఆయనకుఈ పదవి కల్పించడం ఇది రెండోసారి. మహారాష్ట్రకు చెందిన సౌరభ్ బోరాకూ మరోసారి స్థానం కల్పించారు. ఇదే రాష్ట్రానికి చెందిన అమోల్‌కాలే గతంలో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉండగా, ఈసారి బోర్డులో సభ్యత్వం కల్పించారు. అలాగే.. గుజరాత్‌కు చెందిన డాక్టర్ కేతన్ దేశాయ్‌కి కూడా మరోసారి బోర్డులో చోటు కల్పించారు. ఆయన.. యూరాలజిస్ట్. 2001లో అప్పటి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో పదవి కోల్పోయారు. కర్ణాటక నుంచి వీఆర్ దేశ్‌పాండేకు బోర్డులో స్థానం కల్పించారు. తెలంగాణ నుంచి చేవేళ్ల ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి సతీమణి సీతా రెడ్డికి బోర్డు సభ్యురాలిగా స్థానం కల్పించారు.



# పుష్పలో నా ఫొటో.. వైకాపా ఏడుపు

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పుష్ప' సినిమాలో తన ఫొటో పెట్టారని.. వైకాపా వాళ్లు ఏడుస్తున్నారని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. తాజాగా విలేకర్లతో జరిపిన ఇష్టాగోష్ఠిలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "పుష్పలో ఎర్రచందనం స్మగ్లర్‌గా తన నటనతో మెప్పించిన అల్లు అర్జున్‌కు జాతీయ అవార్డు ఇచ్చినప్పుడు.. వైకాపాలోని నిజమైన స్మగ్లర్లకు ఏ అవార్డు ఇవ్వాలి?" అని ఓ విలేకరి చంద్రబాబును ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానం చెబుతూ.. "పుష్పలో కొన్ని సన్నివేశాల్లో బ్యాక్ గ్రౌండ్‌లో నా ఫొటో ఉంటుంది. ఆ సినిమాలో చూపించిన కాలంలో నేను సీఎంగా ఉన్నాను.. లేదంటే ఎర్రచందనం స్మగ్లర్లను నేను కంట్రోల్ చేశానని వాళ్లు నా ఫొటో పెట్టి ఉండొచ్చు. దానికే వైకాపా వాళ్లు ఏడుస్తున్నారు' అని అన్నారు. ఇక ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్‌కు జాతీయ అవార్డు వచ్చిన సందర్భంగా చంద్రబాబు శుభాకాంక్షలు చెప్పారు. "ఉత్తమ నటుడిగా అవార్డు గెలుచుకున్న అల్లు అర్జున్‌కు శుభాకాంక్షలు. అలాగే, వివిధ విభాగాల్లో పురస్కారాలు సొంతం చేసుకున్న వారందరికీ అభినందనలు" అంటూ సోషల్ మీడియా వేదికగా తన విషెస్ తెలియజేశారు. 'పుష్ప' సినిమాలో అల్లు అర్జున్ ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు దొరికినప్పుడు అక్కడ పోలీస్ స్టేషన్‌లో గోడకు చంద్రబాబు ఫొటో ఉంటుంది. అలాగే సినిమాలోని మరో సన్నివేశంలోనూ ఆయన ఫొటో కన్పిస్తుంది.

# విశాఖ రాజధానికి ఆ ముప్పు....?



విశాఖపట్నం : విశాఖను ఎట్టి పరిస్థితుల్లో రాజధానిగా చేయాల్సిందే అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పంతం పట్టి ఉన్నారు. ఆయన సీఎం అయిన తొలి ఆరు నెలల నుంచే మూడు రాజధానుల పాట అందుకున్నారు. ఆయన మనసులో ఉద్దేశ్యం అయితే రెడీ మేడ్ సిటీ విశాఖను రాజధానిగా చేసుకోవడం. అదే టైం లో అమరావతి రాజధానిగా పట్టించుకోకపోవడం అని విపక్షాలు విమర్శలు ఉన్నాయి. అయినా జగన్ పట్టించుకోకుండా ముందుకే అన్నట్లుగా సాగారు. అయితే అమరావతిని అలా వదిలేయకుండా అసెంబ్లీ సమావేశాలకు వేదికగా చేసుకుంటామని శాసన రాజధాని అన్నారు. ఇక కర్నూల్ కి హై కోర్టు తరలింపు అన్నది ఒక డిమాండ్ కాబట్టి అలా చేయాలని కూడా సూత్రప్రాయంగా నిర్ణయించారు. దీని మీద ఒక చట్టం హడావుడిగా చేశారు. కానీ అది న్యాయ పరీక్షకు నిలబడదు అని ముందే రద్దు చేసుకున్నారు. ఇదిలా ఉంటే హై కోర్టు అమరావతిని ఏపీకి ఏకైక రాజధానిగా చెబుతూ తీర్పు ఇచ్చింది. దాని మీద వైసీపీ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్ళింది. అక్కడ ఏమి తీర్పు వస్తుందో చూడాలి. అయితే వైసీపీ ప్రభుత్వం మాత్రం విశాఖ రాజధానికే మొగ్గు చూపుతోంది. అంతే కాదు ఆ దిశగా ఏర్పాట్లు చేసుకుంటోంది. దీంతో విశాఖ రాజధానిగా ఎంతవరకూ సేఫ్ జోన్ అన్న దాని మీద రకరకాలైన కథనాలు వచ్చాయి. విశాఖ సిటీకి ఒక వైపు అంతా కొండలు ఉన్నాయి. తూర్పున సముద్రం ఉంది. ఒకవేళ అనుకోని ఉపద్రవాలు సాగరంలో ఏర్పడితే సిటీకి ఇబ్బంది అంటూ తెలుగుదేశం అనుకూల మీడియా అప్పట్లో వార్తలు రాసింది. ఇంకో వైపు చూస్తే భూకంపాల జోన్ అని కూడా రాసారు. వీటిని వైసీపీ నేతలు మంత్రులు తోసిపుచ్చారు. కానీ విశాఖ విషయంలో మరో ఇబ్బంది ఉందని అంటూ వస్తున్న వార్తలు మాత్రం జాగ్రత్తగా పరిశీలించాల్సినవే. విశాఖ రక్షణ పరంగా వ్యూహాత్మకమైన సిటీగా ఉంది. 1971లో పాకిస్థాన్ తో యుద్ధం వస్తే నాడు విశాఖను పాకిస్థాన్ గురి పెట్టింది. ఘాజీ జలాంతర్గామి విశాఖ వైపు దూసుకువచ్చింది. ముందే ముప్పుని పసిగట్టడం వల్ల విశాఖ సేఫ్ అయింది. ఇక విశాఖలో రక్షణపరమైన సంపత్తి ఉంది. తూర్పు నావికాదళం ఉంది. విశాఖ ప్రస్తుతం ఉన్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో చాలా కీలకమైన ప్రాంతంగా ఉంది. పొరుగున దాయాది పాక్ ఉంది.మరో వైపు చైనా కవ్వింపు చర్యలు ఉన్నాయి. దీంతో విశాఖ తీర ప్రాంతంలో గస్తీ ఎప్పటికపుడు పెంచుకుపోతు న్నారు కానీ ఏ వైపు నుంచి ముప్పు పొంచి ఉందో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విశాఖ ప్రస్తుతానికి అయితే మెగా సిటీగా ఉంది. రేపటి రోజున వైసీపీ ప్రభుత్వం దాన్ని రాజధానిగా చేస్తే చాలా అతి ముఖ్యమైన నగరం అవుతుంది. వీవీఐపీలు అంతా విశాఖలోనే ఉంటారు. దాంతో టార్గెట్ సిటీగా ఇంకా మారుతుంది అన్న అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తూర్పు నావికాదళం కను రెప్ప వేయకుండా తీర ప్రాంతాన్ని కాపాడుతోంది. ఇపుడు రాజధానిగా చేయాలని వైసీపీ ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో నేవీ రక్షణ శాఖ అధికారులు సైతం ముఖ్యమంత్రిని కలుస్తూ విశాఖ రక్షణ గురించి వివరిస్తున్నారు. ప్రభుత్వ సహాయన్ని మరింతగా వారు కోరుతున్నారు. తాజాగా విశాఖ తూర్పు నావికాదళం రక్షక దళ కమాండర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శివమణి పరమేష్ ముఖ్యమంత్రి జగన్ని కలసి తీర ప్రాంత భద్రత గురించి వివరించారు. తాము చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన సాయాన్ని ఆయన కోరినట్లుగా చెబుతున్నారు. విశాఖ రాజధాని కాబోతోందని కచ్చితమైన సమాచారం నేవీ అధికారుల వద్ద ఉండబట్టే ముఖ్యమంత్రిని కలిసి ఉంటారని అంటున్నారు. ఏది ఏమైనా విశాఖకు తీర ప్రాంత రక్షణ అతి పెద్ద సవాల్ అనే చెప్పాలని భద్రతా నిపుణులు సైతం అంటున్న పరిస్థితి ఉంది.




# కీలక ప్రకటనలు వీటిపైనేనా..?

ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ 46వ వార్షిక సాధారణ సమావేశం ఆగస్టు 28న జరగనుంది. 2016లో జియో టెలికాం నెట్‌వర్క్ లాంచింగ్ అనంతరం రిలయన్స్ ఏజీఎంల పట్ల ఆసక్తి మొదలైంది. సామాన్యులకూ కనెక్ట్ అయ్యే విధంగా ప్రతి ఏజీఎంలోనూ ఏదో ఒక ప్రకటన ఉంటూ వస్తోంది. దీంతో ఈ సారి ఏజీఎంలో ఎలాంటి ప్రకటనలు ఉండబోతున్నాయన్నది ఆసక్తిగా మారింది. టెలికాం, రిటైల్, ఎనర్జీ వంటి కీలక రంగాలపై ఈ సారి ప్రకటనలు ఉండే అవకాశం ఉంది. 5జీ ప్లాన్స్: రిలయన్స్ జియో 2016లో దేశీయ టెలికాం మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత ఎన్నో సంచలనాలకు వేదికైంది. ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద టెలికాం నెట్‌వర్క్‌గా అవతరించింది. గతేడాది 5జీ సేవలనూ ప్రారంభించింది. అయితే ప్రస్తుతం జియో వెల్‌కమ్ ఆఫర్ కింద అపరిమిత 5జీ డేటాను జియో ఉచితంగా అందిస్తోంది. ఈ ఏజీఎంలో 5జీ ప్లాన్లను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, 4జీ ధరల్లోనే ఇవీ ఉండే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

**5జీ ఫోన్:** '2జీ ముక్తభారత్' నినాదంతో జియో ఇప్పటికే పలు ఫోన్లను లాంచ్ చేసింది. సాధారణ స్మార్ట్‌ఫోన్లతో పోలిస్తే తక్కువ ధరలో ఈ ఫోన్ ధరలు, టెలికాం ప్లాన్లూ ఉంటాయి. ఇదే కోవలో గూగుల్‌తో కలిసి ఓ 5జీ ఫోన్‌ను తీసుకొస్తున్నట్లు గతేడాది రిలయన్స్ ప్రకటించింది. ఈ సారి రెండు ఫోన్లను తీసుకొస్తారని ప్రచారం జరుగుతోంది. వీటి ధరలు ఎంత? ఏమేం ఫీచర్లు ఉంటాయి? వీటికోసం స్పెషల్ ప్లాన్లు తీసుకొస్తారా? అనేది తెలియాలి.

**ఎయిర్ ఫైబర్.. కొన్ని రోజులు ఫ్రీ!:** టెలికాం సర్వీసులతో పాటు ఫైబర్ సేవలనూ అందిస్తోంది జియో. త్వరలో ఫైబర్ కేబుల్స్ అవసరం లేకుండా ఎయిర్‌ఫైబర్ పేరుతో ఓ 5జీ డివైజ్‌నూ జియో తీసుకురాబోతోంది. ఇప్పటికే ఎయిర్‌టెల్ ఈ తరహా ఫైబర్ డివైజ్‌ను తీసుకొచ్చింది. ఈ ఏజీఎంలో జియో ఎయిర్‌ఫైబర్‌ను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. డివైజ్ లాంచ్ చేసిన కొన్ని రోజుల వరకు కొనుగోలుపై డిస్కౌంట్ లేదా కొంత కాలం పాటు ఫ్రీ ట్రయల్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఐపీఓలపై అప్‌డేట్: రిలయన్స్ నుంచి రానున్న ఐదేళ్లలో రెండు ఐపీఓలు రానున్నట్లు రిలయన్స్ 2019లోనే వెల్లడించింది. ఈ నేపథ్యంలో రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్‌లో ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ రూ. 8,278 కోట్లు పెట్టుబడి పెట్టింది. దీంతో రిలయన్స్ రిటైల్ ఐపీఓకు సంబంధించి ఏజీఎంలో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ గురించీ అప్‌డేట్ ఉండే అవకాశం ఉంది. ఇదే ఏజీఎంలో క్లీన్ ఎనర్జీలో పెట్టుబడుల గురించీ ఏవైనా ప్రకటనలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. గిగా ఫ్యాక్టరీల ఏర్పాటుకు సంబంధించిన ప్రకటనలూ వచ్చే అవకాశం ఉంది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఏజీఎం ప్రారంభం కానుంది. యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది.




# 10 మంది మృతి

మదురై: తమిళనాడులో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. మదురై రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న రైలు బోగీ (ప్రైవేటు పార్టీ కోచ్)లో అగ్నిప్రమాదం సంభవించింది. శనివారం తెల్లవారుజామున 5.15 గంటల ప్రాంతంలో జరిగిన ఈ దుర్ఘటనలో 10 మంది దుర్మరణం చెందారు. రైల్లోకి అక్రమంగా తీసుకొచ్చిన సిలిండర్‌పై టీ చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ ప్రైవేటు పార్టీ కోచ్ ఆగస్టు 17న ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూ నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించింది. శుక్రవారం నాగర్‌కోయిల్ జంక్షన్ వద్ద దీన్ని పునలూరు-మదురై ఎక్స్‌ప్రెస్ రైలుకు అటాచ్ చేశారు. నిన్న రాత్రి మదురై రైల్వే స్టేషన్ వద్ద దీన్ని డిటాచ్ చేసి స్టాబ్లింగ్ లైన్‌లో నిలిపి ఉంచారు. అయితే, ఈ ప్రైవేట్ పార్టీ కోచ్‌లో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు రైల్లోకి రహస్యంగా గ్యాస్ సిలిండర్‌ను తీసుకొచ్చారు. శనివారం తెల్లవారుజామున దానిపై టీ చేస్తుండగా అది ఒక్కసారిగా పేలింది. దీంతో మంటలు చేలరేగాయి. చూస్తుండగానే బోగీ అంతా వ్యాపించాయి. మంటలను గుర్తించిన కొంతమంది ప్రయాణికులు వెంటనే బోగీ నుంచి కిందకు దిగారు. సమాచారమందుకున్న రైల్వే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో 10 మంది మృతిచెందగా.. మరో 20 మంది గాయపడ్డారు. ప్రమాద సమయంలో బోగీలో 65 మంది ఉన్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

**రూ. 10లక్షల పరిహారం..** ఘటనపై రైల్వే శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు రూ. 10లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ ప్రైవేటు పార్టీ కోచ్‌ను ఐఆర్‌సీటీసీ పోర్టల్ నుంచి ఎవరైనా బుక్ చేసుకోవచ్చు.




## భానుడిపై పరిశోధనలకు ఇస్రో సిద్ధం.. సెప్టెంబరు 2న ఆదిత్య-ఎల్ 1 ప్రయోగం

బెంగళూరు: జాబిల్లి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3ని విజయవంతంగా దించి అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్రను లిఖించింది భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ. ఇప్పుడు అదే ఉత్సాహంపై సూర్యుడి రహస్యాలను కనుగొనేందుకు ఇస్రో సిద్ధమైంది. సెప్టెంబరు 2వ తేదీన ఆదిత్య-ఎల్ 1 ప్రయోగం చేపట్టనుంది. ఈ విషయాన్ని ఇస్రో అధికారి ఒకరు వెల్లడించారు. "సెప్టెంబరు 2న ఈ ప్రయోగం చేపట్టే అవకాశాలున్నాయి" అని సదరు అధికారి తెలిపారు. ఇప్పటికే ఈ ఉపగ్రహాన్ని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)కు తీసుకొచ్చారు. పీఎస్ఎల్‌వీ-సి57 వాహకనౌక.. ఆదిత్య-ఎల్ 1ను మోసుకుని నింగిలోకి దూసుకెళ్లనుంది. కరోనాగ్రఫీ పరికరం సాయంతో సౌర వాతావరణాన్ని లోతుగా పరిశోధించడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, ఆస్ట్రేలియా, ఇతర దేశాల అంతరిక్ష సంస్థల సాయంతో ఇస్రో సౌర అధ్యయన ప్రక్రియను చేపట్టనుంది.

**ఆదిత్య-ఎల్ 1 విశేషాలివే..** సూర్యుడిని అధ్యయనం చేసేందుకు ఇస్రో చేపడుతున్న తొలి మిషన్ ఇది. 1500 కిలోల బరువున్న శాటిలైట్ ఇది. భూమి నుంచి సూర్యుని దిశగా 1.5 మిలియన్ కిలోమీటర్ల దూరంలోని లాగ్రాంజ్ పాయింట్ 1 (ఎల్ 1) చుట్టూ ఉన్న కక్ష్యలో దీన్ని ప్రవేశపెట్టనున్నారు. ఈ కక్ష్యలోకి పంపించడం ద్వారా గ్రహణాలతో సంబంధం లేకుండా సూర్యుడిని నిరంతరం అధ్యయనం చేసేందుకు వీలు లభిస్తుంది. ఆదిత్య-ఎల్ 1 మొత్తం ఏడు పేలోడ్లను మోసుకెళ్లనుంది. ఇందులో ప్రధానమైన 'విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనాగ్రాఫ్ (వీఈఎల్‌సీ)తో పాటు సోలార్ అల్ట్రావైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్, ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పెరిమెంట్, ప్లాస్మా అనలైజర్ ప్యాకేజ్ ఫర్ ఆదిత్య, సోలార్ లో ఎనర్జీ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, హైఎనర్జీ ఎల్-1 ఆర్బిటింగ్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, మ్యాగ్నెటోమీటర్ పేలోడ్‌లను అమర్చనున్నారు. సూర్యగోళం నుంచి ప్రసరించే అత్యంత శక్తిమంతమైన కాంతి ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు అనువుగా ఈ పేలోడ్‌లను రూపొందించారు. ఈ పేలోడ్లు ఎలక్ట్రోమ్యాగ్నెటిక్, మ్యాగ్నెటిక్ ఫీల్డ్ డిటెక్టర్ల సాయంతో సూర్యుడిలోని పొరలైన ఫొటోస్పియర్, క్రోమోస్పియర్, వెలుపల ఉండే కరోనాను అధ్యయనం చేస్తాయి. ఎల్-1 ప్రదేశానికి ఉన్న సానుకూలతల దృష్ట్యా నాలుగు పరికరాలు నేరుగా సూర్యుడిని అధ్యయనం చేస్తాయి. మిగతా మూడు సాధనాలు.. సమీపంలోని సౌర రేణువులు, అయస్కాంత క్షేత్రాల గురించి శోధిస్తాయి. ఈ నెల 23న చంద్రయాన్-3 ల్యాండర్ జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన విషయం తెలిసిందే. అందులోని రోవర్ చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు సాగిస్తోంది.

# వైకాపా పాలనలో తితిదే పవిత్రతను మంటగలిపారు: అచ్చెన్నాయుడు

అమరావతి: వైకాపా పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పవిత్రతను మంటగలిపారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. తితిదే ఛైర్మన్‌గా క్రైస్తవుడిని నియమించారని.. దిల్లీ లిక్కర్ స్కామ్‌లో అభియోగాలు ఎదుర్కొంటున్న శరత్‌చంద్రారెడ్డిని బోర్డు సభ్యుడిగా ఎంపిక చేశారని అచ్చెన్న విమర్శించారు. తెదేపా అధినేత చంద్రబాబు నేతృత్వంలో ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన అచ్చెన్నాయుడు.. వైకాపా ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "సీఎం జగన్ పెట్టిన కష్టాలు మర్చిపోకుండా కార్యకర్తలు మరింత కసితో పని చేయాలి. 'ఇసుక సత్యాగ్రహం' పేరుతో ఈ నెల 28నుంచి మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాం. సెప్టెంబరు 1 నుంచి 45 రోజుల పాటు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

కోటి ఇళ్లను సందర్శించేలా కార్యక్రమాన్ని రూపొందించాం. ప్రభుత్వ తప్పుడు విధానాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లేలా సభలు నిర్వహిస్తాం. ఈ నెల 31న యువగళం పాదయాత్ర 200వ రోజుకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా నిర్వహించనున్న సంఘీభావ యాత్రలో జగన్ ప్రభుత్వ బాధితులను భాగస్వామ్యం చేయాలి. 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో అధినేత చంద్రబాబు 30 నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. రాయలసీమ నుంచి చంద్రబాబు పర్యటన ప్రారంభమవుతుంది" అని అచ్చెన్న వెల్లడించారు.

# 16వ వివాహ వార్షికోత్సవం.. యువగళంలో కేక్ కట్ చేసిన లోకేశ్

నూజివీడు: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర 195వ రోజు కొనసాగుతోంది. నూజివీడు నియోజకవర్గంలోని పోతిరెడ్డిపల్లికి లోకేశ్ చేరుకున్నారు. అరిసెలతో తయారు చేసిన గజమాలతో గ్రామస్థులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఇవాళ లోకేశ్, బ్రాహ్మణిల 16వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా యువగళం వాలంటీర్లు, తెదేపా శ్రేణులు ఆయనతో కేక్ కట్ చేయించారు. అనంతరం చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి, పిట్టలవారి పాలెం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించాలని గ్రామస్థులు లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌కు అడ్డగోలు దోపిడీపై ఉన్న శ్రద్ధ తాగు, సాగునీటి ప్రాజెక్టులపై లేదని మండిపడ్డారు. తెదేపా హయాంలో సాగునీటి ప్రాజెక్టులపై ?68,294 కోట్లు ఖర్చుచేస్తే, వైకాపా ప్రభుత్వం వచ్చాక అందులో నాలుగో వంతు కూడా ఖర్చు



చేయలేదని విమర్శించారు. తెదేపా అధికారంలోకి వచ్చాక చింతలపూడి ప్రాజెక్టు, పిట్టలవారిపాలెం వద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తామని తెలిపారు. గ్రామ ఎస్సీ కాలనీలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పునరుద్ధరిస్తామన్నారు. ఎటువంటి పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తామని లోకేష్ స్పష్టం చేశారు.

## షర్ట్ బటన్స్ అన్నీ విప్పేసి బాలయ్య హీరోయిన్ ఒళ్లు విరుపు

నందమూరి బాలకృష్ణ 'లెజెండ్' సినిమా తో తెలుగు లో మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ సోనాల్ చౌహాన్. సాధారణంగా హీరోయిన్స్ ఒక్క సూపర్ హిట్ పడితే ఎన్నో ఆఫర్లు దక్కించుకుంటూ ఉంటారు. అలాంటిది సోనాల్ చౌహాన్ కు లెజెండ్ వంటి భారీ విజయం దక్కినా కూడా ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. తెలుగు లో లెజెండ్ తర్వాత చేసిన సినిమాలు నిరాశ పర్చడం తో తక్కువ సమయంలోనే ఈమె ఫేడ్ అవుట్ అవ్వడం మొదలు అయ్యింది. తెలుగు లో అవకాశాలు తగ్గడంతో ఇతర భాషల్లో సినిమాలు



చేస్తూ అప్పుడప్పుడు టాలీవుడ్ లో కూడా గెస్ట్ రోల్స్ ను పోషిస్తూ సందడి చేస్తూ వస్తున్న సోనాల్ చౌహాన్ అందాల ఆరబోత విషయంలో ఎప్పుడు కూడా ముందు ఉంటుంది. ఈ అమ్మడి ఫోటోలు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం మనం చూస్తూనే ఉన్నాం. స్కిన్ షో విషయంలో ఈ అమ్మడు ఎప్పుడు కూడా మొహమాటం అనేది పడకుండా ఫోటోలను షేర్ చేస్తూ ఉన్న విషయం తెల్సిందే. తాజాగా ఈ అమ్మడు మరోసారి తన అందాలను విందు చేసింది. ఒంటిపై షర్ట్ ఉంది కానీ.. ఆ షర్ట్ మొత్తం బటన్స్ ను విప్పేసి ఒళు విరుస్తూ కవ్విస్తూ ఉంది. ఎద సౌందర్యం ను ఈ అమ్మడు ఎక్స్పోజ్ చేస్తూ ఫోటోకు ఇచ్చిన ఫోజ్ మరోసారి వైరల్ అయ్యింది.

ఆకట్టుకునే రూపంతో పాటు సూపర్ స్కిన్ టోన్ ఈ అమ్మడిది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. నడుము అందం చూపిస్తూ థైస్ తో మతి పోగొడుతున్న సోనాల్ చౌహాన్ అందంకు తగ్గట్లుగా ఆఫర్లు రావడం లేదంటూ సోషల్ మీడియాలో ఆమె అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## చిరుతో స్టెప్పు లేసేందుకు శ్రియ అంత తీసుకుందా..!

ఇష్టం సినిమాతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టిన శ్రియా శరణ్.. తన అందం అభియనంతో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయింది. పెద్ద పెద్ద స్టార్ హీరోల సరసన కూడా నటిస్తూ.. వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూనే వస్తోంది. 2001 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సినిమాల్లో రాణిస్తూనే ఉంది. ఒక్క తెలుగులోనే కాకుండా తమిళ మలయాళ హిందీ కన్నడ చిత్రాల్లోనూ నటించి మెప్పించింది బ్యూటీ. సినీ రంగంలో అడుగు పెట్టినప్పుడు ఎలా ఉందో.. ఇప్పుడు కూడా శ్రియ అదే ఫిజిక్ మెయింటెయిన్ చేస్తుంది. ఓ బిడ్డకు జన్మనిచ్చినా తన అందం ఏమాత్రం తగ్గలేదు. సినీ రంగంలో అడుగు పెట్టినప్పుడు ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. అయితే దాదాపు 20 ఏళ్ల తర్వాత



ఈ క్యూట్ బ్యూటీ మెగాస్టార్ చిరంజీవితో నటించబోతోంది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వం వహించబోతున్న భోళా శంకర్ సినిమాలో శ్రియా శరణ్ కనిపించబోతుంది. ఆయనతో ఓ స్పెషల్ సాంగ్ లో డ్యాన్స్ చేయబోతుందట. చిరుతో ఆమె స్టెప్పులు వేసేందుకు భారీగానే రెమ్యునరేషన్ కూడా తీసుకుంటుందట. ఒక్క పాటకే 70 లక్షల రూపాయలతో పాటు సెపరేట్ జీఎస్టీ తీసుకుంటుందట. చిరు శ్రియాలతో భోళా శంకర్ సినిమాలో స్పెషల్ సాంగ్ ఉంటుందని తెలిసప్పటి నుంచి మెగా అభిమానులు తెగ ఎగ్జైట్ అవుతున్నారు. అయితే ఈ సినిమాలో చిరంజీవి సరసన తమన్నా నటిస్తున్నారు. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్.. చిరంజీవికి చెల్లెలిగా కనిపించబోతోంది. అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రంలో రఘుబాబు మురళీ శర్మ రావు రమేష్ వెన్నెల కిషోర్ ప్రగతి.. తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. అయితే ఈ సినిమా చిరంజీవి నటించబోతున్న 154 వ సినిమా. అలాగే ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్నారు. అన్నా చెల్లెలి అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుంది. తమిళంలో వేదాళం సినిమా సూపర్ హిట్టు కొట్టింది. ఈ చిత్రాన్ని ఎప్పటి నుంచో రీమేక్ చేయాలని ప్రయత్నించగా.. ఇప్పటికి కుదిరింది. అది కూడా మెగాస్టార్ చిరంజీవి ఖాతాలో పడింది. ఈ సినిమా షూటింగ్ మధ్యలో నత్త నడకగా సాగింది. దీంతో ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ చిత్రం ఎప్పుడు రీలీజ్ అవుతుందో ఎవరికీ తెలియదు.




## భగవంత్ కేసరి.. బాలయ్య ఆడితే అది తీన్మారే




నటసింహా నందమూరి బాలకృష్ణ 'అఖండ' చిత్రంతో అద్భుత విజయం అందుకున్నారు. ఆ తర్వాత వీరసింహారెడ్డి ఘనవిజయం సాధించింది. ఇప్పుడు అతడు స్పీడ్ పెంచాడు. అంతేకాదు.. వరస విజయాలపై కన్నేసిన బాలయ్య 'భగవంత్ కేసరి'గా అలరించేందుకు అభిమానుల ముందుకొస్తున్నాడు. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, శ్రీలీల, అర్జున్ రాంపాల్ ఇతర తారాగణం. అనీల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. థమన్ సంగీతం అందించారు. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి సింగిల్ విడుదలకు డేట్ ఫిక్స్ చేసామని చిత్రబృందం ప్రకటించింది. గణేష్ ఆంథమ్ పేరుతో తొలి పాటను సెప్టెంబర్ 1న ఆవిష్కరించనున్నారు. బాలకృష్ణ ఈ పోస్టర్ లో ఎంతో ఛామింగ్ లుక్ తో కనిపిస్తున్నారు. అంతేకాదు.. రంగురంగుల కుర్తాలో బాలయ్య సంక్రాంతి అల్లుడిని తలపిస్తున్నాడు. ఈ పోస్టర్‌లో జాయ్ ఫుల్ మూడ్‌లో ఎన్బీకే కనిపిస్తున్నాడు. ఇది తీన్మార్ పాట అనేది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వినాయక చవితి సందర్భంగా వచ్చే పాట ఇదని అర్థమవుతోంది. బాలయ్య మార్క్ డ్యాన్సులతో ఈ పాట సినిమాకే హైలైట్ గా నిలుస్తుందని అర్థమవుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం తెరకెక్కింది. అక్టోబర్ 19న సినిమా విడుదల కానుంది. ఎఫ్ 2 ఫ్రాంఛైజీతో బ్లాక్ బస్టర్లు అందించిన అనీల్ రావిపూడి మహేష్ తో సరిలేరు నీకెవ్వరు లాంటి హిట్ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పుడు బాలయ్యను భగవంత్ కేసరిగా ఆవిష్కరించనున్నారు.

## అందాలతో పిచ్చెక్కిస్తున్న హీరో గారి భార్య



తెలుగమ్మాయి వితికా శేరు 2008 సంవత్సరంలో కన్నడ సినిమా తో సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. వరుసగా రెండు కన్నడ సినిమాల్లో నటించిన వితికా శేరు ఆ తర్వాత తెలుగు లో 2009 సంవత్సరంలో ప్రేమించు రోజుల్లో సినిమా తో ఎంట్రీ ఇచ్చింది. హీరోయిన్ గా వితికా శేరు ఆశించిన స్థాయిలో సక్సెస్ ను దక్కించుకోలేక పోయింది. ఆ తర్వాత తెలుగు లో కొన్ని సినిమాల్లో నటించినా కూడా పెద్దగా ఈమెకు గుర్తింపు రాలేదు. దాంతో వితికా శేరు మెల్ల మెల్లగా సినిమాల కు దూరం అయ్యింది. 2015 తర్వాత సినిమాల్లో ఈమె కనిపించలేదు. ఆ మధ్య క్యారెక్టర్ ఆర్టిస్టుగా రీ ఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నం చేసింది. హీరోయిన్ గా ఆశించిన స్థాయిలో సక్సెస్ ను దక్కించుకోలేక పోయిన వితికా శేరు బుల్లి తెర ద్వారా పాపులారిటీ ని సొంతం చేసుకుంది. ముఖ్యంగా ఈ అమ్మడు బిగ్ బాస్ ద్వారా మంచి గుర్తింపును దక్కించుకుంది. ఆ తర్వాత యూట్యూబ్ ఛానల్స్ ద్వారా కూడా తన యొక్క పాపులారిటీని పెంచుకుంటూ ఉంది. హీరో వరుణ్ సందేశ్ ను పెళ్లి చేసుకున్న తర్వాత కూడా ఏదో ఒక రకంగా ఇండస్ట్రీలో కొనసాగుతూనే వస్తోంది. వరుణ్ సందేశ్ యొక్క భార్య అయినప్పటికి కూడా సోషల్ మీడియాలో ఈమె అందాల ఆరబోత విషయంలో ఒక అడుగు ముందుకు వేసి ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు నడుము అందాన్ని చూపిస్తూ క్లీవేజ్ షో తో ఆకట్టుకుంది. ఈ రేంజ్ లో అప్పట్లో స్కిన్ షో చేసి ఉంటే తప్పకుండా స్టార్ హీరోల కు జోడీ గా నటించే అవకాశాలు దక్కేది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఈ రేంజ్ లో స్కిన్ షో చేస్తే ఇప్పటికి అయినా సిరీస్ లో లేదా సీనియర్ హీరోల కు జోడీ గా నటించే అవకాశాలు వస్తాయంటూ కామెంట్స్ వస్తున్నాయి.

## రేటు పెంచిన గోల్డెన్ బ్యూటీ

వరుస సక్సెస్ లతో మంచి జోరు మీద ఉన్న మలయాళీ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్. ఈ అమ్మడు తాజాగా విరూపాక్ష మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకుంది. ఈ మూవీతో వరుసగా నాలుగు హిట్స్ తెలుగులో ఆమెకి వచ్చాయి. దీంతో గోల్డెన్ లెగ్ అనే బ్రాండ్ ని అప్పుడే సంయుక్త సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ అమ్మడుకి టాలీవుడ్ లో మంచి డిమాండ్ ఏర్పడింది. టైర్ 2 హీరోలు అందరూ కూడా సంయుక్తని లీడ్ గా తీసుకోవడానికి ఆసక్తి



చూపిస్తున్నారు. పెర్ఫార్మెన్స్ గ్లామర్ రెండింటికి కరెక్ట్ గా మేనేజ్ చేసే కేపబిలిటీ సంయుక్త దగ్గర ఉండటంతో ఆఫర్స్ గట్టిగానే వస్తున్నాయి. ఇక ఈ అమ్మడు డిమాండ్ పెరగడంతో రెమ్యునరేషన్ కూడా అమాంతం పెంచేసిందనే మాట వినిపిస్తోంది. విరూపాక్ష మూవీ వరకు సంయుక్త 50 నుంచి 70 లక్షల వరకు రెమ్యునరేషన్ తీసుకునేది. అయితే డిమాండ్ పెరగడంతో ఒక్కసారిగా 1.50 కోట్లకి రేట్ పెంచేసిందంట. కొత్త ప్రాజెక్ట్స్ కోసం ఈ స్థాయిలో రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారంట. అయితే సంయుక్త లక్ ఫ్యాక్టర్ బాగుండటంతో ఆమెని హీరోయిన్ గా పెట్టుకోవాలని ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఆమె అడిగిన రెమ్యునరేషన్ ఇవ్వడానికి నిర్మాతలు కూడా రెడీ అయిపోతున్నారంట. ప్రస్తుతం ఈ బ్యూటీ కళ్యాణ్ రామ్ పాన్ ఇండి యా మూవీ డెవిల్ లో లీడ్ రోల్ చేస్తోంది. ఈ మూవీ షూటింగ్ దశ లో ఉంది. ఇక ఈ సినిమా సక్సెస్ అయితే పాన్ ఇండియా స్టార్ గా సంయుక్త మారిపోయే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. రష్మికని దాటుకొని టాప్ చైర్ లోకి ఇప్పుడు సంయుక్త మీనన్ వచ్చేలా ఉందనే టాక్ ఫిలిం నగర్ సర్కిల్ లో నడుస్తోంది. ఇక బింబిసారా మూ ఎవీ సూపర్ సక్సెస్ కావడంతో కళ్యాణ్ రామ్ డెవిల్ తో ఆమెని రిపీ ట్ చేశారు. అలాగే మిగిలిన హీరోలు కూడా సంయుక్తని తమ సినిమా లలో రిపీట్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సార్ మూవీ తర్వాత కోలీవుడ్ లో కూడా సంయుక్త డిమాండ్ పెరిగిందనే టాక్ వినిపిస్తోంది.

## చీర కట్టులో అనసూయ మేడం జోరు మామూలుగా లేదుగా..!

జబర్దస్త్ మాజీ యాంకర్ అనసూయ మరోసారి తన ఫోటోలతో వార్తల్లో నిలిచింది. ఇద్దరు పిల్లల తల్లి అయినా కూడా హీరోయిన్స్ స్థాయిలో తన ఫోటోలతో జనాల అటెన్షన్ ను దక్కించుకోగల సత్తా ఉన్న ముద్దుగుమ్మ అనసూయ అనడంలో సందేహం లేదు. ఈ ఫోటోలతో మరోసారి అనసూయ ఆ విషయాన్ని నిరూపించుకుంది. ఈమధ్య కాలంలో జబర్దస్త్ కార్యక్రమానికి దూరం అయిన అనసూయ వరుసగా సినిమాల్లో నటిస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా కాకుండా పాత్రకు ప్రాముఖ్యత ఉన్న సినిమాల్లో



నటించడంతో పాటు ప్రత్యేక పాటల్లో మరియు పాత్రల్లో నటించడం ద్వారా అనసూయ మరింత మందికి చేరువ అవుతుంది. అనసూయ ప్రస్తుతం బుల్లి తెరకు దూరంగా ఉంటుంది. ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే మరో వైపు బుల్లి తెరపై కూడా నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత చేసే అనసూయ మరోసారి తన చీర కట్టు తో కన్నులు తిప్పుకోకుండా చేసింది. చీర కట్టు లో క్లీవేజ్ షో చేసిన ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. ఇంత అందంగా కొన్ని సార్లు హీరోయిన్స్ కూడా కనిపించరు మేడం.. మీరు ఎందుకు స్టార్ హీరోలకు జోడీగా హీరోయిన్ గా నటించడం లేదు అంటూ కొందరు ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటే మరో పదేళ్లు అయినా మీరు ఇంతే అందంగా ఉండాలని కోరుకుంటున్నాం అంటూ కామెంట్స్ చేశారు.




హైదరాబాద్: తెలంగాణలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాలని కోకాకోలా సంస్థ నిర్ణయించింది. తాజాగా తన అదనపు పెట్టుబడుల ప్రణాళికలను మంత్రి కేటీఆర్‌కు వెల్లడించింది. ఈ మేరకు అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్‌తో ఆ సంస్థ ఉపాధ్యక్షుడు జేమ్స్ మేక్ గ్రివి సమావేశమయ్యారు. తమ సంస్థకు భారత్ మూడో అతిపెద్ద మార్కెట్ అని, తమ కార్యకలాపాలను విస్తరించే వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు జేమ్స్ చెప్పారు. ఇందులో భాగంగా తెలంగాణలో తమ పెట్టుబడులను రెట్టింపు చేస్తున్నట్లు వివరించారు.

**సిద్ధిపేట ప్లాంట్‌కు మరో రూ.647 కోట్లు :** సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ వద్ద సంస్థకు ఉన్న భారీ బాటిలింగ్ ప్లాంట్ విస్తరణకు గతంలోనే రూ.100 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టామన్నారు. దీనికి అదనంగా సిద్ధిపేట జిల్లాలో రూ.1,000 కోట్లతో నూతన బాటిలింగ్ ప్లాంట్ నిర్మాణానికి.. ఏప్రిల్ నెల 22న తెలంగాణ ప్రభుత్వంతో ఒక ఎంవోయూ కుదుర్చుకున్నట్లు చెప్పారు. వ్యాపార వృద్ధిని దృష్టిలో ఉంచుకొని అదనంగా మరో రూ.647 కోట్లను ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సిద్దిపేట జిల్లా ప్లాంట్‌లో పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ ప్లాంట్ డిసెంబర్ 24లోగా పూర్తి అవుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

**కరీంనగర్ లేదా వరంగల్‌లో..! :** దీంతోపాటు రెండో నూతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని సంస్థ ప్రకటించింది. కరీంనగర్ లేదా వరంగల్ ప్రాంతంలో ఈ తయారీ కేంద్రం వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ప్రతిపాదిత నూతన తయారీ ప్లాంట్ పెట్టుబడితో కలిపి దాదాపుగా రూ.2,500 కోట్లకు పైగా పెట్టుబడులను.. తెలంగాణలో పెట్టినట్లు అవుతుందని కోకాకోలా సంస్థ ప్రతినిధులు మంత్రి కేటీఆర్‌కు తెలిపారు.

**మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు :** కోకాకోలా తన పెట్టుబడులను రెట్టింపు చేసేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల మంత్రి కేటీఆర్ ఆ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే సంస్థ ప్రతిపాదిస్తున్న నూతన రెండో తయారీ కేంద్రానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అన్ని రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయనడానికి తాజాగా కోకాకోలా సంస్థ ప్రకటించిన అదనపు పెట్టుబడి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు.




## కాంగ్రెస్ విమర్శలపై మోదీ స్పష్టత

బెంగళూరు: శనివారం ఉదయం బెంగళూరుకు వచ్చిన ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు.. కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎం ఇద్దరిలో ఎవరూ హాజరుకాలేదు. మోదీ ఉద్దేశపూర్వకంగానే వారిని ఎయిర్‌పోర్టుకు రావొద్దన్నారని కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అందుకు ప్రధాని నరేంద్రమోదీనే స్వయంగా స్పష్టత ఇచ్చారు. 'తనకంటే ముందు కర్ణాటక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించడంపై మోదీ చాలా చికాకుగా ఉన్నారు. అందుకే ప్రొటోకాల్‌కు విరుద్ధంగా.. వారిద్దరిని ఉద్దేశపూర్వకంగా ఎయిర్‌పోర్టుకు రాకుండా ఆపేశారు. ఇలాంటి రాజకీయాలు హాస్యాస్పదం. చంద్రయాన్-1 విజయం వేళ.. 2008లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కంటే ముందు సీఎంగా ఉన్న మోదీ.. అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్‌కు వెళ్లారు. ఆ విషయాన్ని మోదీ మర్చిపోయారా..?' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. దీనిపై మోదీ నుంచి స్పష్టత వచ్చింది. బెంగళూరులోని హాల్ ఎయిర్‌పోర్టు వెలుపల ప్రధాని మాట్లాడుతూ.. వారిని రావొద్దనడానికి కారణం చెప్పారు. 'బెంగళూరుకు నేను ఏ సమయంలో చేరుకుంటానో కచ్చితంగా తెలీదు. అందుకే ప్రొటోకాల్ విషయంలో గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని ఇబ్బంది పెట్టదల్చుకోలేదు. అందుకే వారిని రావొద్దని చెప్పాను' అని మోదీ వెల్లడించారు. శుక్రవారం గ్రీస్ దేశంలో పర్యటించిన ప్రధాని మోదీ.. ఈ ఉదయం నేరుగా బెంగళూరు వచ్చి, శాస్త్రవేత్తలతో మాట్లాడారు. వారి కృషికి సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా చంద్రయాన్-3 ప్రయోగం తీరును ప్రధానికి ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ వివరించారు.

**మోదీ మాటలతో ఏకీభవిస్తున్నా: డీకే –** ఈ అంశంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. 'ప్రధాని చెప్పినదాంతో నేను ఏకీభవిస్తున్నాను. ప్రొటోకాల్ ప్రకారం సీఎం, నేను ప్రధానిని ఆహ్వానించేందుకు వెళ్దామని అనుకున్నాం. కానీ ప్రధాని కార్యాలయం నుంచి వచ్చిన సమాచారాన్ని మేం గౌరవించాలనుకున్నాం. పొలిటికల్ గేమ్ ఇప్పటికే ముగిసింది. ఇప్పుడు అభివృద్ధిపై దృష్టి సారించాం' అని శివకుమార్ అన్నారు. ఈ ఏడాది కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాను గద్దె దింపి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దానిని ఉద్దేశించే పొలిటికల్ గేమ్ అని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.

## బీఆర్ఎస్‌లో కాకరేపుతున్న తుమ్మల వ్యవహారం.. ఎమ్మెల్యేలకు అధిష్ఠానం పిలుపు

భద్రాద్రి కొత్తగూడెం : బీఆర్ఎస్ అధిష్టానం పిలుపుతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు హైదరాబాద్ బయలుదేరారు. నిన్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మద్దతుగా స్వచ్ఛందంగా వేలాది మంది కదలిరావడంతో బీఆర్ఎస్‌లో వణుకు ప్రారంభమైంది.

పోటీలో ఉంటానని తుమ్మల స్పష్టం చేయడంతో రాజకీయ పరిణామాలపై కేసీఆర్ ఆరా తీస్తున్నట్టు సమాచారం. తుమ్మల రాజకీయ నిర్ణయం దాని ప్రభావంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలతో గులాబీ బాస్ మంతనాలు చేయనున్నారు. మొత్తానికి తుమ్మల వ్యవహారం బీఆర్ఎస్‌లో కాక రేపుతోంది. "శ్వాసయినా వదిలేస్తా కానీ.. తలదించేది లేదు. నా రాజకీయం జీవితం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు అంకితం. గోదావరి జలాలతో వారి పాదాలు కడిగేందుకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్నా" అంటూ ఖమ్మం జిల్లా సీనియర్ నేత, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. వచ్చే ఎన్నికలకు బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాలో చోటు దక్కని నేపథ్యంలో అధినాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న తుమ్మల.. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చారు. జిల్లా సరిహద్దులోని నాయకన్ గూడెం నుంచి భారీ ర్యాలీగా ఖమ్మం నగరంలోని తన నివాసానికి



చేరుకుని అక్కడ జరిగిన సభలో ఉద్వేగంగా ప్రసంగించారు. తనను ఎన్నికల్లో పోటీ చేయకుండా తప్పించామని అనుకుంటున్న వారిది తాత్కాలిక ఆనందమేనని, ప్రజల అభిమానం, అండదండలు ఉన్నంతవరకు తనను ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్ నేతల గుండెల్లో బాణాల్లా గుచ్చుకుంటున్నాయి.




దిల్లీ: ఉప్పుడు బియ్యం ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయంగా వీటి ధరలను అదుపులో ఉంచడంతో పాటు, నిల్వలను సరిపడా అందుబాటులో ఉంచడం కోసం ఎగుమతులపై 20 శాతం సుంకం విధించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్టు 25 నుంచే ఈ సుంకం అమల్లోకి రాగా.. ఈ ఏడాది అక్టోబరు 16 వరకు ఈ నిబంధన కొనసాగుతుందని పేర్కొంది. అయితే, ఎల్ఈవో జారీ కానప్పటికీ ఇప్పటికే కస్టమ్స్ పోర్టుల్లో లోడ్ చేసి ఉంచిన పార్‌బాయిల్డ్ రైస్ కు ఈ సుంకం వర్తించదని ఆర్థికశాఖ వెల్లడించింది. దీంతో పాటు సరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ ఉన్న ఎగుమతులకు కూడా సుంకం నుంచి మినహాయింపు కల్పిస్తున్నట్లు తెలిపింది. ఇటీవల బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై కేంద్రం నిషేధం అమలు చేయడంతో.. ఉప్పుడు బియ్యానికి డిమాండ్ పెరిగింది. ఫలితంగా వీటి ధరలు నానాటికీ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే దేశీయంగా ఉప్పుడు బియ్యం నిల్వలను తగినంతగా అందుబాటులో ఉంచడంతో పాటు, రిటైల్ ధరలను నియంత్రించేందుకు కేంద్రం ఈ సుంకం విధించింది. మన దేశ బియ్యం ఎగుమతుల్లో బాస్మతియేతర తెల్ల బియ్యం వాటా 25శాతంగా ఉంటోంది. అయితే, దేశీయంగా బియ్యం ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో గత నెల బాస్మతియేతర రకాల ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించిన విషయం తెలిసిందే. పాక్షికంగా మరపట్టిన, పూర్తిగా మరపట్టిన, పాలిష్ చేయని తెల్ల బియ్యం ఎగుమతులపై ఈ నిషేధం వర్తిస్తుంది. అంతకుముందు నూకలపైనా నిషేధం విధించారు. ఇప్పుడు ఉప్పుడు బియ్యం ఎగుమతులపైనా సుంకం అమలు చేయడంతో.. అన్నిరకాల నాన్ బాస్మతీ రైస్ ఎగుమతులపై ఆంక్షలు విధించినట్లయింది.

దేశీయ రిటైల్ మార్కెట్లో ఏడాది వ్యవధిలో బియ్యం ధరలు 11.5 శాతం మేర పెరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య 15.54 లక్షల టన్నుల బాస్మతీయేతర బియ్యం మన దేశం నుంచి ఎగుమతైంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఈ ఎగుమతులు 11.55 లక్షల టన్నులుగా ఉన్నాయి. ఎగుమతులు విపరీతంగా పెరగడం, దాని కారణంగా నిల్వలు తగ్గి దేశీయంగా ధరలు పెరగడంతో.. ఈ బియ్యం రకాలపై కేంద్రం నిషేధం విధించింది.




హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌లో పోటీ చేసే అభ్యర్థులు భారీగానే ఉన్నారు. దాదాపు 1025 మంది కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. చివరి రోజు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఆశావాహుల రాకతో గాంధీభవన్ కళకళలాడింది. ఈసారి మాత్రం సీనియర్లు పక్కకు తప్పుకున్నట్లు తెలుస్తోంది. వారసులను రంగంలోకి దించినట్లు సమాచారం. సీనియర్ నేత జానారెడ్డి పోటీ నుంచి తప్పుకుని ఇద్దరి కుమారులను బరిలోకి దింపారు. మిర్యాలగూడ నుంచి పెద్ద కుమారుడు.. నాగార్జునసాగర్ నుంచి చిన్న కుమారుడు పోటీలోకి వచ్చారు. ఈ మేరకు వారిద్దరూ గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. జానారెడ్డి లాగానే పలువురు సీనియర్లు బరి నుంచి తప్పుకుని వారసులను రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. త్వరలోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పోటీ చేసే వారి నుంచి కాంగ్రెస్ దరఖాస్తులు కోరడంతో ఆశావాహులంతా అప్లై చేసుకున్నారు. 119 నియోజకవర్గాల నుంచి 1025 దరఖాస్తులు గాంధీభవన్‌కు చేరాయి. ఈ అప్లికేషన్లన్నీ వడపోత చేయనున్నారు. ఇందుకోసం ఆదివారం నుంచి దరఖాస్తుల స్క్రూట్నీ ప్రక్రియ ప్రారంభంకానుంది. అలాగే ఒకటి, రెండు రోజుల్లో ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ కూడా సమావేశం కానుంది. ఈ భేటీలో దరఖాస్తుదారుల అర్హతపై చర్చించనున్నారు. పోటీలో ఉండేదెవరు? పోయేదెవరో మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

ఇక కొడంగల్ నియోజకవర్గం నుంచి ఒక్క దరఖాస్తు మాత్రమే వచ్చింది. కొడంగల్ నుంచి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేశారు. ఈ నియోజకవర్గం తప్ప మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చి చేరాయి. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు శ్రీధర్ బాబు, సీతక్క, జగ్గారెడ్డి, పోడెం వీరయ్య ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లో విపరీతమైన కాంపిటేషన్ నెలకొంది. ఈ సెగ్మెంట్లకు అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలో అత్యధికంగా ఇల్లందు ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గానికి 38 మంది దరఖాస్తులు వచ్చాయి.




## తెలంగాణ మద్యం వ్యాపారంలోకి ఏపీ సంస్థ.. ఏకంగా 5 వేల దరఖాస్తులు సమర్పణ

**తెలంగాణలో మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం నిర్వహించిన దరఖాస్తుల ప్రక్రియలో ఈసారి పలు ఆసక్తికర అంశాలు చోటుచేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ స్థిరాస్తి సంస్థ ఏకంగా 5 వేల దరఖాస్తులు సమర్పించినట్లు ఎక్సైజ్ శాఖ పరిశీలనలో తేలింది. ఇందుకోసం ఆ సంస్థ ఏకంగా వంద కోట్లు వెచ్చించింది. వైజాగ్ ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్న ఆ సంస్థ తొలిసారిగా తెలంగాణలో మద్యం వ్యాపారంలోకి అడుగుపెట్టినట్లు తెలుస్తోంది.**

## కాంగ్రెస్, బీజేపీ తిట్టడంలో.. సీఎం కేసీఆర్ పుట్లకొద్దీ వడ్లు పండించడంలో పోటీ.. : మంత్రి హరీశ్‌రావు



కాంగ్రెస్, బీజేపీ నేతలు నాయకులు తిట్టడంలో పోటీపడుతుంటే.. సీఎం కేసీఆర్ పుట్లకొద్దీ వడ్లు పండించడంలో పోటీపడుతున్నారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్ధిపేట నియోజకవర్గ పరిధిలోని రాంపూర్ గ్రామంలో మంత్రి హరీశ్‌రావు పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన మంత్రికి గ్రామస్తులు బతుకమ్మలు, డప్పుచప్పుళ్లు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. గుర్రం బండి ఎక్కి గ్రామ ప్రజలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకే తమ ఓటు అంటూ మంత్రికి పలువురు ఏక్రగీవ తీర్మాన కాపీలను కుల సంఘాల నాయకులు, గ్రామస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల కోసం గ్రామానికి వచ్చిన తనకు ఏకగ్రీవ తీర్మానం అందించి గ్రామం చిన్నదైనా.. గ్రామస్తులది పెద్ద మనసు అని నిరూపించుకున్నారన్నారు. రాంపూర్ గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి ఏకగ్రీవ తీర్మానం చేసిన మద్దతు తెలుపడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఏడోసారి సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇచ్చిన తర్వాత వచ్చిన మొట్టమొదటి గ్రామం రాంపూర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చిన తర్వాత రాంపూర్‌లో యాసంగి పంట 18 లారీల ధాన్యం పండించారన్నారు.

## హరితహారంతో రాష్ట్రంలో 33 శాతానికి పెరిగిన అటవీ విస్తీర్ణం: స్పీకర్ పోచారం



బాన్సువాడ: ప్రకృతి దేవుడు ఇచ్చిన వరం, ప్రకృతిని కాపాడితే అది మనలను కాపాడుతుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చెట్లను నరికి, ప్రకృతిని నాశనం చేస్తే విలయాలు సంభవిస్తాయని హెచ్చరించారు. దేశంలో ప్రతి మనిషికి సగటున కేవలం మూడు చెట్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. వాతావరణం సమతుల్యత బాగా ఉండాలంటే భూ విస్తీర్ణంలో 33 శాతం అడవులు ఉండాలి. స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా చేపట్టిన కోటి వృక్షార్చనలో భాగంగా బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పచ్చదనం పెంచడానికి 2016లో ప్రభుత్వం 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. 230 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్దేశించుకోగా దానిని అధిగమించి ఇప్పటి వరకు 270 కోట్ల మొక్కలు నాటారని చెప్పారు. 2014లో తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పుడు అడవుల విస్తీర్ణం 26 శాతం ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం కృషి, హరితహారం కార్యక్రమంతో ఇప్పుడు 33 శాతానికి పెరిగిందని తెలిపారు. చెట్లు ఉంటే వర్షాలు పడతాయని వెల్లడించారు. చెట్లను నాటడం, సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. ఒక్కరోజు కోటి మొక్కలు నాటే 'కోటి వృక్షార్చన' కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు.

## దేశంలోనే అత్యంత సేఫ్ సిటీ హైదరాబాద్: మంత్రి వేముల

హైదరాబాద్: హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే అత్యంత సేఫ్ సిటీ అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణకు పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయని చెప్పారు. ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 20 పరిశ్రమలు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ హైటెక్‌సిటీలో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ జూబ్లీవేడుకలకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ.. ఎస్ఆర్‌డీపీ కింద హైదరాబాద్‌లో 36 ఫ్లై ఓవర్లు నిర్మించామన్నారు. దేశంలో 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. తలసరి ఆదాయంలో దేశంలోనే



తెలంగాణ అగ్రగామిగా ఉందని మంత్రి వేముల అన్నారు. హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెప్పారు. ఐటీ సెక్టార్‌లో హైదరాబాద్ దూసుకుపోతున్నదని తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com